# మిసిమి

మాస పత్రిక

ఏప్రిల్ 1993
వెల రూ. 5/-



# Happy Birthday, Double Helix



# మిసిమి

***"All that we are is the product of what we have thought,"* is *"We are what we think."*** **– Dammapada.**

సంపుటి 4 ఏప్రిల్ 1993 సంచిక 9

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక

చివరకు మిగిలేది – ఆర్.ఎస్. సుదర్శనం

ధోరణి - డా॥ సంజీవ దేవ్

భారతీయ ఆలోచనాధార - మేధాదారిద్ర్యం - శివలింగం

ప్రేమించడం ఒక కళ - అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

విడిప్రతి రూ. 5/- వార్షిక చందా రూ. 60/-

ముఖచిత్రం

"బంగారక్క"

చిత్రకారిణి : నీలిమా చౌదరి

'మిసిమి' లో ప్రచురించే వ్యాసాలతో సంపాదకులు ఏకీభవించారనుకో నవసరం లేదు.

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Flesh**, *n.* The Second Person of the secular Trinity.

**Flop**, *v.* Suddenly to change one's opinions and go over to another party. The most notable flop on record was that of Saul of Tarsus, who has been severely criticised as a turn-coat by some of our partisan journals.

**Folly**, *n.* That "gift and faculty divine" whose creative and controlling energy inspires Man's mind, guides his actions and adorns his life.

**Forefinger**, *n.* The finger commonly used in pointing out two malefactors.

**Forgetfulness**, *n.* A gift of God bestowed upon debtors in compensation for their destitution of conscience.

**Forma Pauperis** (Latin). In the character of a poor person-a method by which a litigant without money for lawyers is considerately permitted to lose his case.

When Adam long ago in Cupid's awful court
(For Cupid ruled ere Adam was invented)
Sued for Eve's favor, says an ancient law report,
He stood and pleaded unhabilimented.

"You sue in *forma pauperis*, I see, "Eve cried;
"Actions can't here be that way prosecuted."
So all poor Adam's motions coldly were denied:
He went away-as he had come-nonsuited. *G.J.*

**Freebooter**, *n.* A conqueror in a small way of business, whose annexations lack the sanctifying merit of magnitude.

**Friendless**, *adj.* Having no favors to bestow. Destitute of fortune. Addicted to utterance of truth and common sense.

**Friendship**, *n.* A ship big enough to carry two in fair weather, but only one in foul.

**Funeral**, *n.* A pageant whereby we attest our respect for the dead by enriching the undertaker, and strengthen our grief by an expenditure that deepens our groans and doubles our tears.

**Future**, *n.* That period of time in which our affairs prosper, our friends are true and our happiness is assured.

**Gallows**, *n.* A stage for the performance of miracle plays, in which the leading actor is translated to heaven. In this country the gallows is chiefly remarkable for the number of persons who escape it.

Whether on the gallows high
Or where blood flows the reddest,
The noblest place for man to die-
Is where he died the deadest. *Old Play.*

**Garter**, *n.* An elastic band intended to keep a woman from coming out of her stockings and desolating the country.

**Generous**, *adj.* Originally this word meant noble by birth and was rightly applied to a great multitude of persons. It now means noble by nature and is taking a bit of a rest.

**Genealogy**, *n.* An account of one's descent from an ancestor who did not particularly care to trace his own.

**Genteel**, *adj.* Refined, after the fashion of a gent.

Observe with care, my son, the distinction I reveal:
A gentleman is gentle and a gent genteel.
Heed not the definitions your "unabridge" presents,
For dictionary makers are generally gents. *G.J.*

**Geographer**, *n.* A chap who can tell you offhand the difference between the outside of the world and the inside.

**Ghost**, *n.* The outward and visible sign of an inward fear.

# చివరకు మిగిలేది

– ఆర్.ఎస్. సుదర్శనం

బుచ్చిబాబు రచన 'చివరకు మిగిలేది' మనో వైజ్ఞానిక నవల. దీనికి ప్రాతిపదిక ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫ్రాయిడ్ (Freud) ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన 'ఈడిపస్ భ్రాంతి' (Oedipus complex). ఇందులో సిద్ధాంత నిరూపణము ప్రధానం కాదు. జీవితాన్ని గాఢంగా, లోతుగా పరామర్శించడం, మానవత్వాన్ని తరచి చూచి దాన్ని అంగీకరించడం ప్రధానం. ''ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ మనిషినీ స్నేహ పాశంలో బంధించి వేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూసినప్పుడు, ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించ గలం. కాని ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం....ఈ నవలకి అదే పునాది.'' (రచయిత వ్రాసిన ఆముఖం-Preface). నవలలో మనో వైజ్ఞానిక సిద్ధాంతం అంతర్గతంగా మాత్రమే ఉంటుంది. పాఠకులకు ఆ సిద్ధాంతం ఫలానా అని తెలియవలసిన అవసరం లేదు. విమర్శకుడు విశ్లేషించి గుర్తు పట్టితే తప్ప కనిపించని విధంగా ఉంటుంది. దానికీ రచయిత వ్యక్తంచేసే జీవిత దృక్పథానికీ తాత్త్వికంగా ఏమీ సంబంధం ఉండదు. నవలలో లభించే జీవిత దర్శనం (The vision of life) అది రచయిత ప్రతిభకూ, వైయక్తికమైన అతని అనుభూతి వైశిష్ట్యానికీ, దాన్ని కళాత్మకంగా రూపొందించిన అతని రచనా శిల్పానికీ తార్కాణం. మనో వైజ్ఞానిక నవల అంటే ఏదో మనస్తత్త్వ శాస్త్రం పఠించడం ద్వారా దానికి అనుగుణంగా ఊహించుకొని కథనీ, పాత్రలనీ కల్పించడం కాదు.

తెలుగు సాహిత్యంలో మనో వైజ్ఞానిక నవల అవతరించడంతో 'కాల్పనికత' (Romanticism) బద్ధలైంది. ఆ విధంగా చూస్తే 'చివరకు మిగిలేది' తెలుగు సాహితీ పురోగతిలో ఒక మైలు రాయి. భావనాత్మక ప్రేమా, ఆదర్శాలూ, జీవిత సత్యం ముందు, దివ్వటీలు సూర్యుడి ముందు కాంతి విహీనమైనట్లు, నిరుపయోగం కావటాన్ని చిత్రిస్తుందీ నవల. కథానాయకుడు దయానిధి భావనాశీలి, సౌందర్య పిపాసి. కాని ఏ స్త్రీని ప్రేమించలేడు. స్త్రీ అంటే చెప్పరాని కుతూహలం. వివాహయోగ్యత గల ఏ అమ్మాయిని చూచినా ఆపేక్ష. కాని ఆమెను భార్యగా ఊహించుకోడానికి మాత్రం మనస్సులో ఏదో పెద్ద ఆవరోధం. చివరకు అతని మనసును ఆకట్టుకొన్న యువతి కోమలి ఒక చరిత్రహీన. ఆమె తల్లిది పడుపు వృత్తి. కోమలికి చదువూ సంస్కారం లేవు. ప్రయత్నించి దయానిధిని ఆకర్షించే చమత్కారమూ అనుభవమూ కూడా లేవు. అయినప్పటికీ దయానిధి ఆమె చుట్టూ తిరుగుతాడు. అవకాశం వచ్చినా ఆమెను అనుభవించలేడు. కారణం-అన్వేషించవలసిందే! తనకు కావలసింది ఏమిటో తనకు తెలీక పోవడమే అతని సమస్య! కోమలి జీవితప్రవాహంలో కొట్టుకుపోయి దయానిధికి దూరమవు తుంది. అతనూ ఆమెను గూర్చి ఆలోచించడం మానుకుంటాడు. ఇలా మరచి పోవడం 'రొమాంటిక్ హీరో' చెయ్యవలసిన పనికాదు! దయానిధికి అందుబాటులో ఉన్న స్త్రీలలో మేనమామ కూతురు 'సుశీల' ఒకర్తె. చదువుకున్నది. అతణ్ణి చేసుకోవాలని యిష్టమే, కాని కొంత స్వాభిమానమూ కొంత అసూయా వ్యక్తంచేస్తుంది. ''సుశీల అసలు ఏ పురుషుణ్ణీ

ప్రేమించలేదు. సుశీల ప్రేమించేదల్లా, ఎవరో తన్ను ప్రేమిస్తున్నారు అన్న-అనుభవాన్ని'' అంటూ సూత్రీకరించేసి, ఆమె అక్కర్లేదంటాడు. నిజమైన కారణం అతనికి సుశీల అంటే భయం. ఆమెకు తనమీదా, తన తల్లితండ్రులమీదా, గౌరవం లేదని అతని జంకు. దయానిధి తండ్రి ఏర్పాటు చేసిన పెళ్ళి సంబంధానికి ఒప్పుకుంటాడు. ఇందిర అతని భార్య అవుతుంది. కాని ఇందిర మీద అతనికి పెద్ద అపేక్ష లేదు. మామగారితో వైమనస్యం తెచ్చుకుంటాడు. ఒంటరి వాడవుతాడు. అతనికి సంఘంతో సరిపడదు. అమృతం వివాహిత. అతని బంధువు. ఆమె అభిమానం ఒక్కటే లోకంలో అతనికి స్వీకారయోగ్యంగా కనిపిస్తుంది. ఒంటరి తనంతో నిరీహుడైన దయానిధి దగ్గరకు ఆమె చుట్టపు చూపుగా వస్తుంది. ఆమె సానుభూతీ, ఆప్యాయతా అతణ్ణి కరిగిస్తాయి. మొదటిసారిగా దయానిధి స్త్రీని స్పృశింపగలుగుతాడు. మానసికమైన అవరోధాన్ని అధిగమించడం జరుగుతుంది. ఈ విధంగా అమృతం దయానిధి జీవితంలో ప్రధాన భూమిక వహిస్తుంది. కాని అమృతాన్ని రొమాంటిక్ కథానాయికగా అనుకోవడానికి ఆమె మరొకని భార్య అవడమే కాదు. ఆమెకు దయానిధితో లేచిపోవాలనే వ్యామోహమూ లేదు. ఆమె దయానిధి పట్ల చూపే భావం ఇదమిత్థమని స్పష్టీకరించడానికి వీల్లేని ఆప్యాయత, అభిమానం, స్నేహం, పరస్పరత.

అందులో సంఘం ఆమోదించని స్త్రీ పురుష సహజమైన వాంఛ కూడా సమ్మిశ్రితమే! అమృతం దయానిధి జీవితంలో పాలు పంచుకోవాలనీ, అతను తనవాడు కావాలనీ కోరదు! ఆమె లౌకికమైన వ్యవస్థలకూ, కట్టుబాట్లకూ, నీతికి విధేయురాలు; సామాన్య సంసారిణి; కాని ఆమెలోని మానవత్వం, స్త్రీత్వం, అన్నింటికీ అతీతమైంది. దాన్ని ఏ ఆదర్శాలూ ఏ 'రొమాంటిసిజమ్' యిదమిత్థమని నిర్వచించలేవు, శాసించలేవు! అమృతం ప్రకృతి (Nature) వంటిది.

అమృతం పంజరం తలుపు తీస్తుంది. దయానిధి లోకంలోకి రివ్వున పారిపోతాడు. క్రొత్తచోట, క్రొత్త మనుష్యుల మధ్య, జీవితాన్ని క్రొత్తగా ప్రారంభించి తన ఆదర్శాల మేరకు మసలుకుందామనుకుంటాడు. అతణ్ణి అదృష్టం వరిస్తుంది. రాయలసీమలో అనంతాచార్యుల ఆశ్రయమే కాదు, 'కాత్యాయని' వజ్రం కూడా దొరుకుతుంది. గనులు త్రవ్వించటానికి పూనుకుంటాడు. డాక్టరుగా ప్రజాసేవకు నడుం కడుతాడు. కాని అతని గతజీవితం అతణ్ణి వెన్నాడుతుంది. కోమలి, ధనికుల చేతుల్లో మారుతూ బ్రతికిన కోమలి, చివరకు దయానిధి దగ్గరకువచ్చి చేరుతుంది. దయానిధి ధనికుడయ్యాడని కాదు, అతన్నే తను మొదటి నుంచీ 'ప్రేమించి' ఉండటంవల్ల! ''ప్రేమ'' అంటే ఏమిటి? అనే జిజ్ఞాస యిక్కడ పరాకాష్ఠ నందుకున్నది. కోమలి అవసరం కొద్దీ ఏదో అబద్ధం చెబుతున్నదని కాదు. కోమలి నిజమే చెబుతున్నది. ఆమె జీవితంలో అన్నీ చూచి విసుగెత్తి, చివరకు తనకు దయానిధే కావాలని అంటున్నది. ఈ కోమలి ఎటువంటి కథానాయిక? శారీరకంగా దయానిధి ఆమెను ఏవగించుకుంటాడు. దూరంగా ఉంటాడు. కాని మానసికంగా ఆమెను కాదనలేడు. పొమ్మనలేడు! ఆమెలో ఏ ఆకర్షణా లేకపోయినా, ఆమెను నిర్దాక్షిణ్యంగా, నిర్లక్ష్యంగా చూడలేడు! ఆమెపట్ల అతని భావం-దయ, జాలి, కరుణ, ఏదీ కాదు-ఆమె తను వదల్చుకోలేని గత జీవితానుభూతి వంటిది. తను వద్దన్నా కావాలన్నా తనతో ఉండే సత్యం; ఆమెతో సంభాషణ తనని తను విమర్శించుకున్నట్లు ఉంటుంది. ఒక విధంగా ఆమె శరీరం, తను ఆత్మ. ''చూడు కోమలీ-నాకు ప్రేమంటే ఏమిటో యింతవరకు తెలిసింది కాదు. అందరిలాగా, శరీర వాంఛనే

ప్రేమనుకుని, నన్నునేను దగాచేసుకోలేను. ఇతరులు ఎవ్వరితోనూ, ఏ ఒక్కరితోనూ పంచుకోలేనిది నా ప్రేమ. అదొక దృష్టి-జీవితం అంతటినీ, తుదీ మొదలూ, ముందూ వెనుకా, అన్నింటినీ దూరంగా చూచి అర్థం చేసుకునే ప్రపంచంపై ఒకచూపు....నీతో స్నేహం వల్ల ఆ దృష్టిపోతుంది'' అంటాడు. దీనికి కోమలి జవాబు: ''....మనం ఒకళ్ళకి ఒకళ్లు తన్మయత కలిగించుకుంటాం. అప్పుడు ధైర్యంగా, బలంగా, సరదాగా ఉంటుంది. ఆ టైమ్‌లో ఎన్నో మంచి పన్లు చేస్తాం.'' ఈ ద్వైధీభావం (ఆత్మ వేరు, శరీరం వేరు అని), దానికి సవాలు (ఆ రెండూ ఒకదానికొకటి అవసరం అనీ, ఒక్కటే అనీ) చివరిదాకా, అంటే నవల ముగింపుదాకా ఉంటుంది. కోమలిరాకతో పునరావృత్తమైన దయానిధి పూర్వ చరిత్ర ఎన్నో అపోహలకు అవకాశం కల్పిస్తుంది. ద్వేషంగా ప్రజ్వలిస్తుంది. కార్మికులు తిరుగుబాటు చేసి దయానిధి గనుల్నీ యింటినీ ధ్వంసం చేస్తారు. దయానిధి నిర్మించి పెట్టుకున్న తల్లి శిలాప్రతిమ ముక్కలై పోతుంది. కోమలీ గాయపడుతుంది. నిరాశ్రయుడైన దయానిధి కోమలితో మరొక క్రొత్తచోటు, క్రొత్తజీవితం వెదుక్కుంటూ బయల్దేరుతాడు. బయల్దేరుతూ ప్రశ్నించుకుంటాడు: ''చివరకు మిగిలిందేమిటి?'' అని. ''తనతో తాను సమాధానపడటం-అది మిగిలింది'' అని జవాబు. నవల ముగుస్తుంది.

దయానిధి, అమృతం, కోమలి 'రొమాంటిసిజమ్'లో తయారైన ప్రతిమలు కారు. వీరి కథలో 'ప్రేమ' కూడ యిదివరకు రొమాంటిక్ సాహిత్యంలో స్థిరపడి, సినిమాల కెగబడి, నేడు యువతీ యువకుల నోట నిత్యమూ వినబడే పదంకాదు. ఈ నవలలో దయానిధి దేశసేవాసక్తి, సంఘోద్ధరణా, సంక్షేమ కార్యకలాపమూ-అన్నీ అతను ఆత్మసంక్షోభం నుంచీ, తన అంతర్యంలోని సమస్యనుంచీ, పలాయనం కావడానికి వెదుక్కున్న మార్గాలుగా మాత్రమే కనిపిస్తాయి! తనతో తాను సమాధాన పడలేని వ్యక్తి లోకంలో ఎక్కడా ఎప్పుడూ సమాధానపడ లేడని ధ్వని!

★ ★ ★

దయానిధి ఎదుర్కొన్న సమస్య ఏమిటి? నవలలో దయానిధి తల్లి పాత్ర చిత్రించబడ లేదు. ''కాని ఆమె చేసిన అపచారాల ఫలితం, నీడలా అతన్ని వెంటాడి, సంఘ విమర్శ ద్వారా జీవితాన్ని కలుషితం చేస్తుంది.'' అంటూ 'ఆముఖంలో' (preface) రచయిత వ్రాశాడు. తల్లి మరణం, ఆ సమయంలో దయానిధి కోమలి యింటి చుట్టూ ప్రదక్షిణచేస్తూ ఉండటం యిదీ నవల కథా ప్రారంభం. నవలకు ప్రధానమైన పై రెండు విషయాల్తో మొదటి అధ్యాయం సూటిగా ప్రారంభం అవుతుంది. తల్లి ప్రవర్తన మంచిది కాదన్న మాటలు సూచనగా ఎవరైనా అనడం, దానితో దయానిధిలో కలిగే మార్పు, ఆ వ్యక్తి మీద అతను చూపే ద్వేషం- (వాచ్యంగా కాదు, క్రియారూపేణా) - ఆధారాలుగా దయానిధికి తల్లి ఎంతటి ఆరాధ్య దేవతో పాఠకులు గ్రహించవలసి ఉంటుంది. తల్లి ఆరాధ్య దేవత, కాని ఆమె శీలవతి కాదన్న సంగతి అతను మనస్సులో ఎప్పుడూ విమర్శించలేదు. తర్కించలేదు. ఇతర కన్యలమీద లేని ఆకాంక్ష తనకు కోమలి మీద ఎందుకో అతనికి తర్కించుకున్నా అర్థం కాదు. ఆమె చరిత్రహీన కావడం కారణం కావచ్చు. కాని దయానిధి మాత్రం అలా అనుకోలేదు. దయానిధి సమస్య మానసికమైంది. అతని సమస్యకూ హేమ్‌లెట్ (Hamlet) ఎదుర్కొన్న సమస్యకూ పోలిక ఉంది. విషయం రచయిత గుర్తించి 'ఆముఖం' (Preface) లో పేర్కొనడమే కాదు. నవల మొదటి కూర్పులో దయానిధి 'హేమ్లెట్'ను గూర్చి పెద్ద

వ్యాసం వ్రాసి, తద్వారా తన సమస్యని కొంత అర్థం చేసుకున్నట్లు కూడా చిత్రించాడు. (రెండవ కూర్పులో ఈ భాగాలు కత్తిరింపబడినవి.) దయానిధి 'చేతన' (psyche)లో సుప్రతిష్ఠితమైన తల్లి మూర్తి అతని సమస్యకు కారణం. ఒక వైపు ప్రేమకు ఆమె ప్రతీక: మరొకవైపు సంఘం ఆమోదించలేని స్వేచ్ఛా ప్రవర్తనకు, నైతిక వ్యతిక్రమానికీ ఆమెయే ప్రతీక. తల్లిని ఆరాధ్య దైవంగా భావించే వ్యక్తి లోకంలో అందరిలోనూ ఆమె మూర్తినే అన్వేషిస్తాడనేది ఒక సత్యం-ఇది అజాతమైన ప్రేరణ. అందువల్లే దయానిధి కోమలి చుట్టూ తిరుగుతాడు. ఆమె స్వేచ్ఛా ప్రవర్తన అతణ్ణి ఆకర్షిస్తుంది. కాని ఆమె నుంచీ ఆప్యాయత, ఆదరణా లభించవు! (అందుకు తగిన వ్యక్తిత్వం ఆమెకు లేదు). ఆదరణకూ అప్యాయతకూ దూరమైన దయానిధి క్రమంగా సంఘంమీద పగ సాధిస్తాడు. అతను చేసుకున్న వివాహం, భార్యపట్ల చూపిన నిర్లక్ష్యం అందుకు తార్కాణం. దయానిధిని హేమ్లెట్‌తో పోలిస్తే ఒక ముఖ్యమైన భేదం తెలుస్తుంది. తల్లి శీలమూ ప్రవర్తనా కారణంగా హేమ్లెట్ యావత్ స్త్రీ ప్రపంచాన్నీ, సచ్ఛీలయైన ఒఫీలియాని, "Frailty, thy name is woman" అని త్రోసిపుచ్చుతాడు. అప్యాయతకూ, ఆదరణకూ ప్రాధాన్యం యివ్వని, ఆదర్శాలకు ప్రాధాన్యం యిచ్చే రొమాంటిక్ హీరో ప్రవర్తన అది! (హేమ్లెట్‌కు గాని దయానిధికిగాని రెండే మార్గాలు: తల్లిని పూర్తిగా అంగీకరించడం లేక పూర్తిగా అంగీకరించకపోవడం. దయానిధి అంగీకరిస్తాడు; సంఘాన్ని ఎదిరించవలసి వస్తుంది. హేమ్లెట్ అంగీకరించడు, సంఘంలో ఆదర్శపురుషుడు కావలసిన బాధ్యత అతనిమీద పడుతుంది. ఇద్దరికీ ఓటమి తప్పదు). దయానిధి రొమాంటిక్ హీరోకాడు. అతను అప్యాయత, ఆదరణ ప్రధానమైన విలువలుగా ఆశించి వాటిమీద ఆధారపడే సామాన్యుడు. అందువల్ల అతను మానసికంగా సంఘంతో, సంఘం కట్టుబాట్లతో, అభిప్రాయాలతో ఘర్షణపడతాడు. సంఘం ఆదరణనీ, అభిమానాన్నీ కోరకుండా ఉండలేడు. అవి లభించవు. ''జీవితంలో నిజమైన విషాదం ద్వేషించడం కూడ కాదు. నిజమైన విషాదం ప్రేమించలేక పోవడం.... 'నా కొరకు చెమ్మగిలు నయనమ్ము లేదు'-కంటె విషాదకరమైన గీతం ఏది ఉంది? ఈ సమస్య నన్ను బాధించింది...వ్యక్తిగతమైన విముక్తి-ఈ నవలకి ప్రేరణ'' అని చెప్పుకొన్నారు రచయిత. ఇక్కడ ప్రేమించలేక పోవడం అనే లోపం ఏ ఒక్కరిదీ కాదు అని గుర్తించాలి. తన తల్లి చరిత్ర ద్వారా, తన 'చేతన'లో ఆమె తాదాత్మ్యం ద్వారా, దయానిధి సంఘాన్ని ఆమోదించలేడు; అదే కారణంగా అతణ్ణి అనుమానంతో చూసే సంఘమూ అతణ్ణి గౌరవించ లేదు! అయితే సమస్యకు పరిష్కారం ఏమిటి? ''మనిషినీ మనిషినీ స్నేహపాశంలో బంధించివేసే మానవత్వం శక్తుల్ని అన్వేషించడం....'' ....'ఆత్మవత్ సర్వ భూతాని.' 'ఆత్మ' స్వరూపం ఆదర్శాలకూ అభిప్రాయాలకూ, నామరూపాలకూ అతీతమైనదనే 'ఆత్మజ్ఞాన' లబ్ధికోసం అన్వేషించినప్పుడే వ్యక్తి తనతో తను సమాధానపడటం. తద్వారా సర్వ భూతాలతో సమాధానపడటం జరుగుతుంది. అంటే 'చేతన'లో తిష్ఠ వేసుకున్న మాతృదేవత విగ్రహం ముక్కలై, అందులోని దైవత్వం నామరూప రహితమైన చిచ్ఛక్తిగా దర్శనమివ్వటం జరగాలి. నవల చివర అదే జరిగింది.

దయానిధి చేతనలోని తల్లిమూర్తివంటి స్త్రీ, లోకంలో అతనికి అమృతంలో కనిపించింది. అమృతంలో తల్లి-భార్య అనే రెండు భావనలూ సమన్వయం చెందాయి. ఆమెలో ఆప్యాయతా, నైతిక వ్యతిక్రమణము (దయానిధి కోసం) రెండూ కలసి వచ్చాయి. లోకంతో సమాధానపడి, లోకంలో ఉంటూ, దయానిధికి ప్రేమామృతాన్ని అందించగలిగిన ఆమెకు ఏ మానసిక సంఘర్షణలూ లేవు. ఆమెకు 'తప్పు' చెయ్యడం అంటే ఏమిటో తెలీదు.

ప్రేమించడం ఒక్కటే తెలుసు. ఆమె ప్రకృతి స్వరూపిణి అని గ్రహిస్తాడు దయానిధి. మాతృత్వమే ఆమె ధ్యేయం. దయానిధికి ఆమె ప్రసాధించిన వరం పునర్జన్మ. ఆమె ద్వారానే అతనికి లోకంతో మళ్ళీ నిజమైన సంబంధం, జీవితం మీద ఆసక్తీ ఏర్పడ్డాయి.

మానవ సంఘం మానవ నిర్మితం. కావాలనుకున్నా సంఘజీవియైన మానవుడు ప్రకృతివైపు వెనక్కి ప్రయాణం చెయ్యలేడు. అతడు గతచరిత్ర భారాన్ని భుజాలమీద మోస్తూ ముందుకు నడవవలసిందే! కోమలి ఆ చరిత్రకు ప్రతీక. ''ఎన్నో ముళ్ళు, ఎన్నో కీటకాలు, ఆ శరీరాన్ని మైల పరిచాయి-ఏమీ తెలీనట్లు యిక్కడ ఆత్మ నిద్ర పోతోంది. అతని కోర్కెలు, తీరని వాంఛలు, యథార్థం కాని కలలు, అనుసరించలేని ఆదర్శాలూ, ఆంతరంగికమూ-అన్నీ కోమలై నిద్రిస్తున్నాయి. ఆమెని చంపితే, హత్యకాదు; ఆత్మహత్య....'' అందుకే నవల ముగింపులో ''గనులు పూడ్చబడ్డాయి. వజ్రంమీద వచ్చిన సిరి, సంపద, (ప్రకృతి యిచ్చిన వరప్రసాదం) అంతా ఆహుతి అయింది. తనకున్న బంధనాలు తెగిపోయాయి. తల్లి రాతి విగ్రహం....విరిగి పడిపోయింది-పాదాలు మాత్రం మిగిలాయి. 'అమ్మయ్య' అనుకున్నాడు. ఇప్పుడతనికి పరిపూర్ణ స్వతంత్రం....'' కాని కోమలి చేతిని బుజం మీద వేసుకుని....నడ వడం సాగించాడు....

''అంతా చీకటి....పైనా, కిందా-అన్నీ నక్షత్రాలే. తన సిరి, సంపదా, 'కాత్యాయని'-అన్నీ కోటి వజ్రాలై. ఆకాశాన అలంకరించాయి....చీకటి నక్షత్రాలు విశ్వమంతా. వాటిలో ఒక చిన్న నక్షత్రం సృష్టిలా వికసించి విశ్వమంతటా వ్యాపించింది. అంతా తమదే-కాని చెయ్యి చాస్తే ఏదీ అందదు; అన్నీ తమరివే కాని నోరిప్పి పిలిస్తే ఏదీ పలకదు''-ఇది మనిషి ఒంటరితనాన్ని గురించి. ''రెండు కొండల మధ్య నుంచి నడిచి అవతలికి చేరుకున్నారు''-ఇది ద్వంద్వాలను అధిగమించటం. ''కోమలి గడ్డిలో వాలి పోయింది. 'ఇక నేను నడవలేను బాబూ-యిక్కడ పడుకుందాం' అన్నది''-ఇది జీవితంలో అన్వేషణ ముగియటం. ''చివరికి మిగిలిందేది?.... ప్రేమా? ధనమా? కీర్తా? ఏదీ కాదు..... ....చివరికి మిగిలింది తను! ....తన్ను తాను పరిపూర్ణంగా చూశాడు.... తనతో తాను సమాధానపడి. తన్నుతాను స్వీకరించి, కౌగలించుకుని ఏకమయ్యాడు....ఈ జీవితాని కర్థం ఎందుకుండాలో! అర్థం లేదనే తలంపులో నిరుత్సాహం, బాధ లేవు! కొత్తబలం, వికాసం, ఆత్మ విశ్వాసం, దృఢనిశ్చయం ఉంటాయి....మానవుడికి కావల్సింది మతాలు, దేవుళ్ళు, మొక్కుబళ్లు, రాచకీయాలు కావు; మానవుడికి కావల్సింది. దయ-కొంచెం. కాస్త ఐనా చాలు....''-ఇది ఆత్మజ్ఞానం. ''రెప్ప పైకి లేచిన తెల్ల వెలుగు ఆకాశంలో నాలుకచాచి పాకుతోంది. నక్షత్రాలని దగ్గరకు తీసుకొని తనలో కలుపుగుంటోంది, వెలుగు.''-ఇది ఆత్మవత్ సర్వభూతాని! ''కోమలితో, ఎక్కడో మరో కొత్త జీవితం ప్రారంభించాలి.... ప్రపంచంలోని ప్రేమంతా తనే దాచేసుకుని, అమాయకంగా పడుకున్న కోమలి''-ప్రేమతో దీప్తమై, లోకంతో క్రొత్తగా సంబంధాన్ని ఆకాంక్షిస్తున్న దయానిధి ఆత్మే, కోమలి! ''శరీరం అనుభవంతో ఆత్మై పోయింది!''

★ ★ ★

కోమలిలో మానవాత్మ, వ్యక్తి జీవితం, మానవచరిత్ర ధ్వనిస్తాయి. మానవుడు తన సహజ ప్రకృతిని-'ఆత్మని'-ఏవగించుకుని, ఆదర్శాలను అన్వేషిస్తాడు. సంఘ జీవనంలో, ఆదర్శాల చట్రంలో అతని సహజ ప్రకృతి నలిగిపోతుంది. కలుషితమౌతుంది. రూపం మారినా అదే

చివరకు తిరిగి వస్తుంది. ఆ ప్రకృతికి నశింపులేదు. ఇది వ్యక్తి జీవితం. చరిత్రలోనూ మానవుని నాగరకత, సంస్కారం, యావత్తూ మానవత్వాన్ని అంగీకరించేందుకే అనిపిస్తుంది! అమృతం దగ్గర అప్పుతీసుకుని యాభై రూపాయల్ని కోమలి తలగడ క్రింద పెట్టడంతో దయానిధి ఆమెకు దూరమౌతాడు. ఇది ఎంతటి భావగర్భితమైన సంఘటనమో ఆలోచిస్తే తెలుస్తుంది: సంఘ వ్యవస్థ, నాగరకత, డబ్బుమీద ఆధారపడినవి- ఆ 'డబ్బు' ప్రకృతి (Nature) నుంచి మానవుడు అప్పుగా తీసుకున్నదే! ఆ డబ్బు ప్రభావానికి లోబడి కోమలి కొన్నాళ్లు దాస్యం చేస్తుంది. నలుగుతుంది, కలుషితమై పోతుంది. దయానిధి అమృతాన్ని పొందిన రాత్రి, ఆమె పెట్టెలోని డబ్బుని గ్రహించి, క్రొత్త జీవితాన్ని అన్వేషిస్తూ వెళ్ళడం మరొక అర్థస్ఫూర్తిగల సంఘటన. ప్రకృతి స్వరూపాన్ని సాక్షాత్కరింప జేసుకున్న మానవుడు లోకంలో చేసే ఆత్మజ్ఞాన ప్రయత్నం అది. తర్వాత దయానిధి అమృతం డబ్బుని తిరిగి పంపించేస్తాడు: ఇది మరొక మలుపు. అంతలో అతని భార్య మరణిస్తుంది-వ్యవస్థ నిర్మించిన బంధం నుంచి విముక్తి. అమృతం కన్న సంతానాన్ని దర్శిస్తాడు- ప్రకృతి ధ్యేయం నెరవేరింది. కోమలి తిరిగి వస్తుంది-మానవునిలో ఆత్మచింతనం ప్రారంభమౌతుంది. దీని పర్యవసానం లౌకికం. లౌకిక జీవనం సర్వం దగ్ధం కావడం-మానవుని ఆత్మ సాక్షాత్కారం. ఈ విధంగా వ్యాఖ్యానిస్తే నవలలో దయానిధి, అమృతం, కోమలి మధ్య జరిగిన గాథలో ప్రత్యంశమూ అర్థస్ఫూర్తితో నవల సమగ్ర స్వరూపానికి దోహదం చేసేదిగా కనిపిస్తుంది. ఇది పాఠకుని, విమర్శకుని ఊహాశాలిత్వం మీదా, చిత్త సంస్కారం మీదా ఆధారపడిన విషయం.

★ ★ ★

ఫ్రాయిడ్ సిద్ధాంతం దృష్ట్యా చూస్తే దయానిధి 'న్యూరాసిస్' (Neurosis) నవలలో చక్కగా పోషింపబడింది. తల్లిమూర్తితో దయానిధి లైంగిక ప్రవృత్తి ముడిపడి ఉండటం మూలాన (Mother-fixation) అతను శారీరకంగా స్త్రీని పొందటానికి అశక్తుడు. ఈ అశక్తతని కప్పి పుచ్చుకోవడానికి అతను చేసే చేష్టల ఫలితమే, కనుపించిన అమ్మాయిలతో చనువుగా, స్నేహంగా ఉంటూ, యితరుల మనస్సుల్లో అపోహల్ని కల్పించటం. సంఘం అతన్ని దుయ్యబట్టి దుమారం రేపింది. అంటే అది ఒక విధంగా దయానిధి స్వయంకృతాపరాధమే. భార్యను వదలిపెట్టి ఒంటరిగా ఉంటూ మిత్రుని చెల్లెల్ని-శ్యామలను-తన యింట్లో ఆమె మానసిక వ్యాధి చికిత్స కోసం ఉంచుకోవడం 'న్యూరాసిస్' లేని వ్యక్తి, యింగిత జ్ఞానం ఉండే వ్యక్తి చేసే పని కాదు! 'అతని జీవితమే సరిగా లేదు.... ఇతరులని బాగుచేసే అధికారం, డిగ్రీ ద్వారా అతనికి ఉంది. కాని నైతికంగా అట్లాంటి అర్హత లేదేమో!'' అనే స్పృహ అతనికే కలుగుతుంది. అందువల్లే అతనికి 'న్యూరాసిస్' నుంచీ విముక్తి క్రమంగా సాధ్యమైంది. పునస్సంధానానికి ముహూర్తం పెట్టితే, సరిగా ఆ సాయంత్రం రాజకీయ సభలో ఉపన్యసించి అరెస్టు కావడం- అంతకు పూర్వం రాజకీయాలతో ఏ సంబంధం లేనివాడు అలా ప్రవర్తించడం- అది 'న్యూరాటిక్' ప్రవర్తనకు చక్కని ఉదాహరణ. స్త్రీతో శారీరక సంబంధం ఏర్పడే అవకాశం వచ్చినప్పుడల్లా దయానిధిలో కలిగే ఉద్విగ్నత, భయం, గందరగోళం అతని 'న్యూరాసిస్'ను ఋజువు చేస్తుంది. నిద్రిస్తున్న కోమలి ఎదుట నిల్చుంటే, ''ఏదో శక్తి అతనిలో ప్రవేశించి అతన్ని కార్య శూన్యుణ్ణి చేసింది...శరీరం 'ఇది అన్యాయం, నేనీపని చెయ్యలేను. నేను సౌందర్యం! నన్ను నేను ధ్వంసం చేసుకోలేను, ఇతరులనీ ధ్వంసం చెయ్యలేను! నన్ను పదిలెయ్యి'' అన్నదట! శారీరకమైన సంపర్కం సౌందర్యాన్ని ధ్వంసం

చేస్తుందని భయమట! శారీరకమైన పునస్సంధానం జరగక్కుండా రాజకీయ సభలో అరెస్టు కావడానికి యిచ్చిన ఉపన్యాసం 'స్వేచ్ఛ, స్వాతంత్ర్యా'లను గూర్చి! వివాహం దాస్యమట! శ్యామల యొక్క 'న్యూరాసిస్' అర్థం చేసుకునేందుకు ప్రయత్నం ద్వారా, తన సమస్యని తనే పరిశీలించుకొని క్రమంగా మానసికమైన ఆరోగ్యాన్ని సాధిస్తున్న దయానిధికి, అమృతంతో సంభవించిన ఏకాంతం చివరకు పరిపూర్ణమైన విముక్తిని ప్రసాదించింది. అటుపైన దయానిధి ఎదుర్కొన్నది తాత్త్వికమైన సమస్య. 'న్యూరాసిస్' నయమవడంతో జీవిత సమస్యలన్నీ పరిష్కారం అయినట్లు భావించగూడదనే విషయాన్ని మనస్తత్త్వ వేత్త లందరూ నొక్కి చెబుతారు. దయానిధి ఆత్మపరిశీలన ద్వారా తన 'న్యూరాసిస్' తనే నయం చేసుకున్న ప్రజ్ఞాశాలి. అదృష్టవంతుడు. అందువల్లే అతని అన్వేషణము, ఆత్మ జ్ఞానంతో, ఆత్మసాక్షాత్కారంతోగాని పర్యవసించలేదు.

★ ★ ★

ఈ దేశంలో ఆదర్శానికీ ఆచరణకూ గల దూరం చాల పెద్దది. శుష్క వేదాంతాన్ని వల్లించడం, గీతాపారాయణం చెయ్యడం, కాషాయ వస్త్రాలు ధరించి 'స్వామిజీ' అనే నామధేయంతో సంఘంలో ఆధ్యాత్మికతకు ప్రతినిధులుగా వ్యవహరించడం వగైరాల మీద విమర్శ ఉంది ఈ గ్రంథంలో. కాని నిజమైన ఆధ్యాత్మిక విలువల్ని తరచి నిరూపించే నవల కూడా దీన్ని మించినది మరొకటి ఉండదు. ''తన ప్రవర్తనని, సరియైనదని బుజువు చేసుకుని సమాధానపడటం కోసం, మానవుడు చేసే యత్నమే, తన నిజ స్వరూపం'' అంటాడు దయానిధి. ''శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠి తాత్, స్వభావ నియతమ్ కర్మ కుర్వన్ నాఽప్నోతి కిల్బిషమ్'' అన్న గీతా శ్లోకం జ్ఞాపకం వస్తుంది.

వ్యక్తికీ సంఘానికీ ఏర్పడే సంఘర్షణని చిత్రించడంలో పై శ్లోకార్థమే ఈ నవలలో ధ్వనించింది. ''నేడు మన సంఘం ఆమోదిస్తున్న నీతిని ప్రతిపాదించినవారు విచిత్రమైన, గతించి పోయిన వాతావరణంలో ఉన్నారు. ఈ నీతి, మత సిద్ధాంతాల పైనా, సంఘంతో నిమిత్తం వదలుకున్న కొద్ది మంది ఋషుల వేదాంత ఘోషపైనా, ఆధారపడి ఉంది. ఇది తప్పు అనే సాహసం నాకు లేదు. ఇది మనకు సరిపడదూ అనగలను. దానికి కారణం యీ నీతి మనం ఆచరణలో పెట్టలేక పోవడమే.... మన సంఘంలో మనుష్యులు బద్ధకించి, ఉన్న వాటితోనే తృప్తిపడి, మోక్షం పేరు చెప్పుకొని యీ ప్రపంచాన్నీ, జీవితాన్నీ, ఒక జాడ్యంగా ఒక పీడకలలాగా భావించి ఎల్లాగో రోజులు గడుపుతున్నారు.... మనం ఆధ్యాత్మిక విలువల పేరూ, వేదాంతం పేరూ చెప్పుకుంటూ, మనుష్యులమాట మరచిపోతున్నాం-'' ''మంచితనం అంటే పట్టుబడని చెడ్డతనమేనా?'' ''తాను చేసిన పని తనకి నచ్చాలి; మంచిదని స్థిరపరచుకోవాలి. అది ముఖ్యంగాని, యితరుల కళ్ళ ద్వారా చూచి విలువకట్టి, ఒక కార్యాన్ని ఖండించడం, నైతికంగా పిరికితనం.'' ''తన జీవితం పాడుచేసుకున్న వ్యక్తి ఇతరులనైనా బాగుచేద్దామని సంకల్పిస్తే, అన్నీ పేచీలే. తన జీవితం బాగుచేసుకున్న వ్యక్తికి, ఇతరుల జోలి అక్కర్లేదు.'' ''సంఘాన్ని మార్చలేదు. మనుష్యుల్ని మార్చలేదు. మారిస్తే బాధ, పగ, యుద్ధం. తనతో తను సమాధాన పడాలి. అది యీనాటికి సాధించాడు. ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం ....అది బాహ్యప్రపంచంలో లేదు....పిచ్చి ప్రపంచాన్ని దయతో దూరంగా ఉంచే ఔదార్యం, మతాన్ని, దైవాన్ని, మనుష్యుల్ని తోసేసి సంతృప్తి చెందే ఆధ్యాత్మిక దృష్టి తనలో కడసారి యథార్థం.''

ఫ్రాయిడ్, రస్సెల్, మార్క్స్, కర్క్‌గార్డ్-పాశ్చాత్య సంస్కృతీ స్రవంతి ఎంతగా ప్రవహించినా, భారతదేశంలో దాని గమ్యస్థానం వేదాంత సాగరం అనే సామాన్య విషయాన్ని ఋజువు చేస్తున్నది యీ నవల. కాని అది ఎవరికి వారు వ్యక్తిగతంగా ఋజువు చేసుకోవాలనీ, సాధించాలనీ నొక్కి చెప్పడమే విశేషం. ''ఏ ఒక్కరి పరిస్థితులూ, బుద్ధి వికాసాలూ మరొకరికి రావు. ఐనా వాళ్ళందర్నీ ఒక ఫక్కీలో నడచుకోమనడమే, మన దౌర్భాగ్యం. ఎవరి జీవితాన్నివారు చక్కబెట్టుకుంటే ప్రపంచం బాగు పడుతుంది. ''వైయక్తిక దృక్పథం (Personalism and Individualism), మానవతావాదం (Humanism), అస్తిత్వవాదం (Existentialism)-ఏ పేరుతో వ్యవహరించినా, ''మనం ముక్కలై 'నువ్వూ' 'నేనూ' అయి ఉత్తర దక్షిణాలకు ప్రయాణం చేసింది.... 'అందరూ' మాత్రం లేరు'' అనే సత్యాన్ని గుర్తించిన దృక్పథం, దానికి అనుబంధమై సహనము. క్షమ, దయ ప్రధానమైన విలువలుగా నడిచే జీవితమూ, ఆధునిక మానవునికి అవసరం అంటున్నదీ నవల. 'జీవితంపై ఒక దృక్పథం కలగచెయ్యాలన్న' రచయిత ఉద్దేశం నెరవేరినట్లే. *

An open Letter to the Prime Minister:

# "It is Time for Cunning

**A prince, wrote Machiavelli, must imitate the fox and the lion, for lion cannot protect himself from traps, and the fox cannot defend himself from wolves. One must therefore be a fox to recognise traps, and a lion to frighten wolves. Therefore, a prudent ruler ought not to keep faith when by doing so it would be against his interest and when the reasons that made him bind himself no longer exist....**

*These words are from the Epigram of Rooswelt."*

**Editor, MISIMI**

# ధోరణి – V

– డా॥ సంజీవ దేవ్

ఆత్మహత్య ఏ వేళలో చేసుకోవాలి, ఏ విధంగా చేసుకోవాలి, నొప్పి లేకుండా చేసుకొనే ఉపాయం ఏమిటి, తన ఆత్మహత్య తన మరణానంతరం తన భగ్నప్రేమకు కళంకం ఆపాదించేదిగా ఉండకుండా ఏ విధంగా సంచరించాలి అని ఆలోచించే భగ్నప్రేమికురాలులాగ సగం చచ్చిన ముఖం పెట్టి ఏమిటి ఆలోచిస్తూ ఈ నిర్జన ప్రదేశంలో విశ్రమించి ఉన్నావు?

నీవు పలికినవన్నీ ఏవిధంగా జరగకుండా ఉండాలా అని ఆలోచిస్తున్నాను. ఆత్మహత్య చేసుకోవటం ఎట్లాగో తెలుసు. కాని నాకు తెలియాలసింది ఆత్మహత్య చేసుకోకుండా ఉండటం ఎట్లా అనేది. అదే క్రిందటి ఆదివారం మొదలు ఈ సోమవారం వరకు ఆలోచిస్తున్నాను. కాని సరైన మార్గం కనిపించలేదు.

వారం రోజులుగా ఆలోచించినా దొరకని సమాధానాన్ని నీకు ఒక్కమాటలో చెపుతాను విను.

అంతకంటే మహదానందమేమి ఉంటుంది, చెప్పు, వింటాను.

నా సమాధానం నీకు చాలా తేలికగా తడుతుంది. కాని అదెంత తేలికదో అంత బరువైనది.

ఈ విధంగా నన్ను ఊరించకపోతే వెంటనే ఆ మహారహస్యమేమిటో చెప్పివేయరాదు?

చెబుతా విను. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనన్ను తొలగించుకోవటమే ఆ మార్గం. ఆత్మహత్య చేసుకోకుండా ఉండటానికి అంతకు మించిన మంచి మార్గం మరొకటి లేదు. అందుకే అంటాను, ఆత్మహత్య చేసుకోవటం కంటే చేసుకోకపోవడం ఎంతో కష్టమైన కార్యం అని.

అవును చెప్పిన మార్గం చాలా సులభమైందే, సందేహం లేదు, కాని వచ్చిన చిక్కు ఏమంటే ఆ మార్గాన్ని అమలుపరచటానికి మార్గమేమిటా అని. మార్గం తెలియటం వేరు తెలిసిన మార్గాన్ని అమలు జరిపే మార్గాన్ని కనుక్కోవటం వేరు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన్ని తొలిగించుకోవటం ఏ విధంగా అని. దేన్నయినా తొలిగించుకోవాలి అని ఆలోచన జనించినంత మాత్రాన అది తొలగదు. తొలగించాలనే ఆలోచన వేరు, తొలగించటం అనే పనివేరు. ఆలోచన కలగటం సులభంకాదు కాని కలిగిన ఆలోచనకు రూపం ఇవ్వటం అన్నిటికంటే ఎక్కువ కష్టం.

ఏది ఏమైనా హత్య మంచిది కాదు, ఆత్మహత్య అంతకంటే మంచిది కాదు. అన్నిటికంటే మంచిది ఏమంటే హత్య జరపకుండా ఉండటం, ఆత్మహత్యకు తావీవకుండా ఉండటం. హత్య స్వార్థానికి చెందితే ఆత్మహత్య నిస్వార్థానికి చెందుతుంది. ఒకోసారి అటుదిటు కావచ్చుకూడ.

ఏమిటి ఆత్మహత్యకు దూరంగా ఉండే నీ ప్రయత్నం ఎంతవరకు సాగివచ్చింది.

నా మానసిక బలాన్ని ఉపయోగించి ఆ ప్రయత్నంలో విజయం పొందేనని చెప్పటానికి సంతోషిస్తున్నాను.

ఆంతరిక అభినందనలు తెలుపుతున్నాను నీ ప్రయత్నంలో నీవు పొందిన సాఫల్యానికి. ఇక నీ కర్తవ్యం ఏమిటంటే నీవు దేన్నయితే జయించావో అటువంటి జయాన్ని ఇతర్లుకూడా పొందేట్లు కృషిచేయాలి.

తప్పక ప్రయత్నిస్తాను, తప్పక ప్రయత్నంలో సాఫల్యం చెందుతాను. ఆ సాఫల్యాన్ని విరివిగా వికసింపచేస్తాను.

మనిషి తాను పొందిన బాధను పంచిపెట్ట పనిలేదు కాని తానుపొందిన ఆనందాన్ని పంచిపెట్టాలి. మొదటి దాన్ని పంచిపెడితే దోషం, రెండవదాన్ని పంచిపెట్టకపోతే దోషం.

సరే, నా సలహా నీకు మంచిమేలు కలిగించినందుకు నీకు అభినందనలు తెలపటం కాక నాకు నేను కూడా తెలుపుకుంటున్నాను.

ఇదివరలో నాకు తట్టని ఆనందం ఇప్పుడు ఇతర్లకు ఆనందం కలిగించటంలో తడుతుంది. ఇదివరలో ఇతర్లనుంచి ఆనందం పొందటంలో మాత్రమే నాకు ఆనందం కలిగేది. ఇప్పుడు ఇతర్లకు ఆనందం ఇవ్వటంలో నాకు ఆనందం కలగటం చూస్తే నా ఆనందానికి హద్దులుండ టంలేదు. నీవూనేను కలిసి యూనివర్సిటీలో మహావిజ్ఞానాన్ని అధ్యయనం చేసినాకూడ నాది యూనివర్సిటీలోనే ఉండిపోయింది, నీది నీలో దినదిన ప్రవర్ధమానం అవుతూ ఉంది. అందుకే నిన్ను నేను అడుగుతున్నాను, నాలోని 'నేను' నేనుగా మాత్రమే ఉండక 'నేను'ను దాటి నేనుకాని విస్తృతిని పొందటానికి కారణం ఏమిటని.

ఇది మానవుని సహజ పరిణామం.'నేను'తో బయలుదేరిన జీవయాత్ర క్రమేణ 'నేను'ను అధిగమించి 'చిన్న నేను' నుంచి 'పెద్ద నేను'లోకి విస్తరించి విశ్వవ్యాప్తమవుతుంది. దీన్నే స్వార్థ బిందువు నిస్వార్థ సింధువులో అనంతరూపాంతరం చెందింది అనవచ్చు. కాని నీకు నా సలహా ఏమిటంటే ఎపుడో తప్ప ఎల్లప్పుడూ నీవు ఇటువంటి ఆలోచనలతో సతమతం కావద్దు. ఎక్కువకాలం బహిర్ ద్రష్ట (Extravert) గా వుంటూ తక్కువ కాలం అంతర్ ద్రష్ట (Introvert) గా ఉండటం అలవాటు చేసుకో. అసంతృప్తిని, అసంతుష్టిని దరిచేరనీయ కుండా చూడాలి. తెంపు, సాహసం, ఆశావాదం, సమీపంలో దూరాన్ని దర్శించాలి. నీ జీవనయానం ఈ విధంగా విశ్వయానం అయిపోతుంది.

నీవు ఎన్నో చాలాచాలా చెప్పేవు. అయినా ఎన్నో మరెన్నో ఇంకెన్నో చెప్పనివి మిగిలిపోయాయి. వాటన్నిటినీ చెప్పమని నేను అడగనూలేను, అడిగినా నీవు చెప్పనూలేవు. అయినా, వాటిలోని కొన్నిటినైనా నేనే స్వయంగా అవగాహన చేసుకో ప్రయత్నిస్తాను. ప్రయత్నించటమేమిటి, అవగాహన చేసుకొంటాను.

అంతే కాదోయి, కేవలం చదవటంతో మాత్రమే నిలిస్తేచాలదు, కొంతయినా వ్రాయటం నేర్చుకోవాలి. వారానికి వందపుటలు చదివే మనిషి వారానికి పదిపుటలైనా వ్రాయటం చేయాలి. అయిదు పుటలైనా ఆలోచించటం చేయాలి, రెండుపుటలైనా అనుభూతించటం చేయాలి.

వీటన్నిటినీ కొద్దో గొప్పో నీవు చెప్పకముందు నుంచి చేస్తూనే ఉన్నాను. నీవు చెప్పేవు

కాబట్టి ఇంకా ఎక్కువ శ్రద్ధతో చేస్తాను.

నీవు వీటన్నిటిలో దక్షుడవు అయినావు కనుక ఇతర్లచేత చేయించాలే కాని స్వయంగా చేయాలిసిన అవసరం లేదు. నేనుకూడా ఇతర్లచేత చేయించగలను కాని అంతమాత్రంతోనే సంతృప్తి పడికూచుంటే నాచేత చేయించబడ్డ ఇతరులు మాత్రమే చేస్తారుకాని వారిచేత చేయించిన నేను మాత్రం చేయలేక పోతాను. అందుకే నేనుకూడా క్రమం తప్పక చేస్తూనే ఉంటాను. అయితే, క్రమం తప్పితే నిరుత్సాహపడను, నిరాశ చెందను, నిర్జీవిగా నటించను.

బాగుంది, ఏవైఖరి అవలంబిస్తే జీవితపు గూటిలో ఆనందదీపం ఉజ్వలంగా వెలుగు తుందో ఏ పాటపాడితే పరిసరాలు ఆనందరాగిణిలో ప్రతిధ్వనిస్తాయో, ఏ రూపకల్పన చేస్తే దిగంతాలు వర్ణస్పందనతో ప్రతిబింబిస్తాయో ఆ వైఖరిని నీవు అవలంబించటం నీకుమాకు కూడా ఎంతో ఉల్లాసప్రదంగా ఉన్నది.

అవును, నేను అవలంబించిన వైఖరి మాత్రం ఒక్కటే ఆనందజీవనానికి మార్గంకాదని నాకు తెలుసు. అదికూడా ఒక మార్గం. నాది సుందర మార్గం, కొందరిది తార్కికమార్గం, మరికొందరిది సేవామార్గం. వీటిలో ఏ మార్గం కూడా భౌతిక జగత్తును వదలాలసిన అవసరంలేదు. భావ సౌందర్యం కూడ చాలావరకు భౌతిక జగత్తుమీదనే ఆధారపడి ఉంటుంది. భౌతిక జగత్తులో సౌందర్యం మాత్రమే కాక అందుకు వ్యతిరేకమైంది కూడ చాలా ఉంటుంది. అంటే ఈ ఇంద్రియగ్రాహ్య జగత్తులో సురూపం కురూపం రెండూ ఉంటాయి, సునాదం కునాదం రెండూ ఉంటాయి.

నీవు ఎక్కువగా భావజగత్తుకు సంబంధించిన వాడివైనా నిన్ను భౌతిక జగత్తు ఎంతగానో ఆకర్షించటం గమనార్హం. భౌతిక జగత్తులోని అస్తిత్వాలు నశించేవి కనుక వాటిని ప్రేమిస్తూ కూచుంటే అవి నశించటం జరిగినప్పుడు మన ఆనందం కూడా నశించటం ద్వారా మనకు దుఃఖం కలుగుతుంది కనుక మనం అశాశ్వతమైన వాటిని ప్రేమించక శాశ్వతాలను ప్రేమిం చటం ద్వారా మనం అనశ్వరమైన ఆనందాన్ని పొందవచ్చుననే ఒక సనాతన దృష్టి మనలో పారంపర్యంగా వస్తూంది. కాని ఇది అంతగా సమర్థించగల దృష్టి కాదు. ఈ వాదంలోని వాస్తవాన్ని గురించి విపులీకరించటంకంటే విపులీకరించకపోవటం మేలు కలిగిస్తుంది.

అవునయ్యా, ఆనందం అనేది తాత్కాలికమా చిరకాలికమా అనే ప్రశ్నయే లేదు. క్షణ భంగురమైందంతా తక్కువదీ కాదు, ఎక్కువ కాలం నిలచేదంతా గొప్పదీ కాదు. మేఘాల మీది ఇంద్రధనసు నిలిచేది క్షణకాలమే. కాని అది ఇచ్చే ఆనందం ఎంతో కాలం నిలుస్తుంది, సాంధ్యతార మెరిచేది కొంత సేపే, కాని అది ప్రసాదించే రసానుభూతి ఎంత సేపో. దీని అర్థం క్షణ భంగురమైంది మాత్రమే ఎక్కువ సుందరమైందనీ, ఎక్కువ కాలం నిలచేది తక్కువ సుందరమైందనీ కాదు. సౌందర్యమనేది అందులో ప్రధానమైంది కాని అది ఎంత సేపు నిలుస్తుందీ, ఎంత సేపు నిలవదూ అనేది కాదు. ప్రభాత కాంతి పూవు అందం ఒక్కరోజుకంటే ఎక్కువ నిలవదు, అందుకు విరుద్ధంగా చెదరకుండా సంవత్సరాల పర్యంతం నిలచి కనిపిస్తున్న శైలశిఖరపు అందం అనంతకాలంగా వెలుగుతూ ఉంటుంది. కనుక సౌందర్యానికి కొలత ఖచ్చి రూపమే కాలం కాదు.

ప్రకృతి శోభ నీ జీవితాన్ని రసమయం చేసింది. ప్రాకృతిక సౌందర్యాన్ని రెండుగా విభజించ వచ్చు - కదిలే సౌందర్యం, కదలని సౌందర్యం. సెలయేళ్లు, నదీ ప్రవాహాలు,

సాగర తరంగాలు, మేఘాలు, నడిచే నీడలు, రాలే ఆకులు, అగ్ని జ్వాలలు, పడవ తెరచాపలు మొదలైనవి కదిలే సౌందర్యం. కొండలు, బండలు, లోయలు, హిమసంహితలు, ఎండిపోయి, నెర్రెలు నెర్రెలుగా పగిలి పోయిన నేల మీద చచ్చిపోయి కొమ్మలు విరిగి బెరడు ఊడి నిలువుగా అడ్డంగా వ్రేళ్లు కనపడుతూ సగం తెల్లగా సగం మచ్చలుగా పడిపోయిన బ్రహ్మాండమైన చెట్టు మొదలు మొదలైనవి కదలని సౌందర్యం. వీటన్నిటిలో కొన్నిటిని దగ్గర నుంచి, మరికొన్ని టిని దూరం నుంచి (Closeup and Longshot) చూస్తుంటే వాటిని కాక వేటినో చూస్తున్నట్లుంటుంది. అవి మనలో నుంచి బయటికి వచ్చి కంటికి కనిపిస్తున్నాయా, లేక బయట నుంచి వచ్చి మనలో ప్రవేశించి మన మానస పటలంపై ముద్రలు వేస్తున్నాయో తెలియని రసానుభూతిని కలిగిస్తాయి. ఈ దృశ్యాలను ఆనందించటంలో వెలుగు నీడలు ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. సూర్యకాంతి వస్తువును గంభీరంగా చూపితే, చంద్రకాంతి మృదువుగా చూపితే నక్షత్రకాంతి చూపుతుంది అతి మృదువుగా. వెన్నెలను ఆనందించటం సులభం కాని నక్షత్ర కాంతిని ఆనందించటం సులభం కాదు. ఎందుకంటే నక్షత్ర కాంతి చీకటికి దగ్గరలో ఉంటుంది. చీకటిని ఆనందించాలంటే ఎంతో సున్నితమైన మనస్సుకావాలి, ఎంతో సూక్ష్మమైన కన్నులుకావాలి.

ప్రకృతిని వదలినాకూడ మానవుని నిత్య జీవితపు వ్యావహారిక దశను కూడ చూచి గ్రహించి ఆనందించ వచ్చు. మనిషిలోని కనిపించే స్వరూపం, కనిపించని స్వభావం, వ్యక్తమవటానికి ఆరాటపడే భావం, ఇవన్నీకూడ లోతుగా పరిశీలించే వారికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయి, వైచిత్ర్యాన్ని సృష్టిస్తాయి.

ఇవన్నీ ఎవరిలోనో ఉన్నాయని మనం అనుకోటం ఎందుకు? ఇవన్నీ నీలో ఉన్నాయి, నాలో ఉన్నాయి. నీలోనివి నాకు కనిపిస్తాయి, నాలోనివి నీకు. నాలోనివి నాకు, నీలోనివి నీకు కనిపించవు. ఆ విధంగా ఎవరివి వారికి కనిపించటం మంచిదా, కనిపించకపోవటం మంచిదా అని తేల్చటం కొంత కష్టతరంగానే ఉంటుంది. ఎవరిలోని మంచి స్వభావం వారికి తెలిసి నందున తమలో దంతా అదే విధమైన ఉజ్వల స్వభావం అని భ్రమచెంది దాన్ని ఇంకా ఉజ్వలం చేయడాన్ని మానుకొంటారు.

అవునవును, నీవు చెప్పింది నిజమే. అదే విధంగా తమలోని చెడ్డ స్వభావం తమకు తెలిసినందున కొందరు దిగులుపడి నీరసించి పోతారు. తమ చెడ్డ స్వభావాన్ని మంచి స్వభావంగా మార్చుకోటానికి తమ శక్తినంతనూ వినియోగించి కొందరు సఫలులైతే మరికొందరవుతారు విఫలులు. ఇతర్ల మంచి స్వభావాన్ని చూచి కొందరు సంతోషిస్తే తమలో అటువంటి మంచి స్వభావం లేనందుకు కొందరు విచారిస్తారు.

అసలు మనుషుల్లో మంచి స్వభావం అనీ, చెడ్డ స్వభావం అనీ ఉంటాయా అని. దీన్ని ఇంత వరకూ నేను సరిగా తేల్చుకో లేక పోతున్నాను. చీకటికీ వెలుగుకీ మధ్య ఉన్న భేదం విశదంగా తెలుస్తుంది కాని చెడుకూ మంచికీ మధ్య ఉన్న భేదం విశదంగా తెలియటం లేదు. చెడు ఏది కాదో అది మంచి అనీ, మంచి ఏది కాదో అది చెడు అనీ నిర్వచిస్తేనో!

మనకు వచనాలతోను, నిర్వచనాలతోను, ప్రవచనాలతోను సత్యం తేలదు. మరి దేనివల్ల అంటే గవేషణల ద్వారా, ప్రయోగాల ద్వారా, ప్రగతి మార్గాల ద్వారా కాని సత్యం లభించదు. ఏది మంచి, ఏది చెడు అని తేల్చటం అసలు అనవసరమేమో! కారణం, మంచిదని తేలిన

దానిని స్వీకరించలేక పోతున్నాం, చెడు అని తెలిసిన దాన్ని విసర్జించ లేక పోతున్నాం.

అవును కాని అంత మాత్రాన మంచిని మంచిగాను, చెడునుగాను, తెల్పి చూపకపోతే చీకటి తెల్లగా ఉంటుందని, వెలుతురు నల్లగా ఉంటుందనీ, పర్వత శిఖరాలు లోతుగా ఉంటాయనీ, లోయలు ఎత్తుగా ఉంటాయనీ పొరబడుతుంటాం. కనుకనే ఒకటి మరొకటిగా కాక ఏది అదిగానే చలామణి కావాలి. వరుడు వరుడుగా కనపడాలి కాని వధువుగా కనపడ కూడదు. నిప్పు వేడిగా తట్టాలి, మంచు చల్లగా తట్టాలి కాని మరో విధంగా తడితే ప్రమాదం అవుతుంది. ప్రమాదాన్ని ప్రమాదం అని వ్రాయాలి కాని పొరపాటున ప్రమోదం అని వ్రాస్తే ప్రమోదానికి బదులు ప్రమాదమే సంభవిస్తుంది.

నేను వచ్చి చాలా సమయం దాటిపోయింది ఇక వెళ్లి పోతాను. ఇక్కడకు నీవు వచ్చి... నేను వచ్చి అనాలసింది పోయి నీవు వచ్చి అని అనటం జరిగింది. ఇదే పొరపాటు చేయరాదని చెపుతూ పొరపాటు చేయటం.

సరే పో, వీలున్నపుడల్లా వచ్చిపోతుండు. అసలు రావడం వేరు, పోవటం వేరు కావు. నీవు ఉదయం ఇక్కడ కనిపించినపుడు నీవు రావటం జరిగింది. అదే సమయాన మీ ఇంటి వారి దృష్టిలో నీవు పోవటం జరిగింది. కనుక రావటం పోవటం సందర్భాన్ని బట్టి ఆ మాటలు అనిపించుకోటమే కాని రెండూ ఒకటే. ఈ రెంటికీ అసలు పేరు కదిలిపోవటమే. ఒకరి దగ్గర కనబడటం రావటం అయితే, మరొకరి దగ్గర కనపడకుండా పోవటం పోవటమవుంది. లోపలికి నడవటాన్ని రావటం అంటే, బయటికి నడవటాన్ని పోవటం అంటారు. భోజనం చేయమంటే అది కూడ చేయకుండా పోతున్నావు.

లేదు, అపుడే ఆకలిగా లేదు.

నీవు పొరపడుతున్నావోయి. ఆహారానికీ ఆకలికీ సంబంధం లేదు. నేడు చాలా మంది ఏదైనా తినటం ఆకలైకాదు, రుచి నిమిత్తమే తినటం. ఆకలయి తినే వాడు ఏ కూరతో అయినా సంతృప్తిగా తింటాడు. ఆకలి లేక పోయినా తినేవాడు పదార్థాలు రుచిస్తే కాని తిన లేదు. రెండవ వాడికి ఆకలి తీరటం కాదు కావలసింది, రుచిగా ఉండటం. నీకు అపుడే ఆకలిగా లేదంటున్నావు. అయినా ఇంటికి పోవాలని ఆతురపడుతున్నావు.

అదేమిటి అట్లా మాట్లాడతావు? ఆకలి తీర్చుకోటానికేనా ఇంటికి పోవటం? ఆకలిని ఎక్కడైనా తీర్చుకోవచ్చు, ఇంటికే పోవాలా?

అవును, ఇంటికి పోవటం అంటే ఆహారం నిమిత్తమే కాదు. ఆహార నిమిత్తం కూడా పోతారు ఇంటికి, ఇది అందరికీ ఒకే పని. కాని ఇంటికిపోటం ఎన్నో పనుల నిమిత్తం పోతారు. నూతనంగా పెళ్లి అయిన వాళ్లు భార్యను చూచుకోటానికో, భర్తను చూచుకోటానికో, కొత్త పుస్తకం తెప్పించుకున్న వాళ్లు దాన్ని చదువుకోటానికీ, నిత్యం ఉత్తరాలు అందుకొనే వాళ్లు ఆనాటి ఉత్తరాలు ఎవరి దగ్గర నుండి వచ్చినవా అనే కుతూహలంతో, కొత్తగా పిల్లలను కన్నవాళ్లు ఆ చంటివారి నవ్వునూ, ఏడ్పునూ చూచుకోటానికీ, ఇల్లు మాత్రమే సర్వస్వం అనుకొనే వాళ్లు ఇంటికి పోతారు.

గొప్పగా చెప్పేవులే, ఇకపో, ఇంటికి పో నేటికి, రేపు మళ్లీరా. వస్తావా?

రండి రండి, చీకటి పడుతుండగా వస్తున్నారు. వెలుతురులో రావడం ఇష్టం లేదా?

అసలు వెలుతురు అంటేనే ఇష్టం లేదేమో మీకు. అయితే వెలుతురు అంటే ఇష్టం లేనప్పుడు బాగా నల్లగా చీకటి పడినప్పుడు వస్తారు. కాని మీరు చీకటి నల్లబడ కుండా ఇంకా కొంత మసక వెలుపులో ఉండగానే బయలు దేరి వచ్చారు. దీన్ని బట్టి తేలేదేమంటే మీకు పూర్తిగా వెలుతురు కాని పూర్తిగా చీకటికాని గిట్టవు అని. ఆ రెంటి సంధి మాత్రమే గిడుతుందని. ఆ రెంటికీ అది సంధి కనుకనే దాన్ని సంధ్య అంటారు. తెలుగులో అంటారు సంజ అని. ఈ సమయంలోని చీకటిని అందుకే సంజ చీకటి అంటారు.

ఏమిటి ఏదో విచారంగా ఉన్నట్లు కనపడుతున్నారు? మీ ఇంటిలోని వారు, ఇంటి బయటవారు అంతా క్షేమంగా ఉన్నట్లు తెలుసు. మరి మీ ముఖం మీద విషాద ఛాయలు గోచరిస్తున్నాయి. ఎంత సేపటి బట్టి ఇక్కడ కూచొని ఉన్నారు. నేను వస్తానని తెలుసు. మీరు విచారంగా కూచొని ఉండటం చూస్తే నేను వస్తానని విచారంగా ఉన్నారేమో అని నేను విచారించాలసి వస్తుంది.

విచారంతో కూచొని ఉన్నమాట నిజమేకాని ఆ విచారం మీ రాక మీద ఆధారపడి నదికాదు. అయినా మీరొస్తారంటే నాకు కలిగేది విచారం కాదు, సంతోషమే అని మీకు తెలుసుండి కూడ ఆ విధంగా నన్ను ఆ మాటలతో బాధిస్తారెందుకు?

మరి మీ విచారానికి కారణం తెలుసుకోవాలి అని ఉంది. సంతోషానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని అంతగా అనిపించదుకాని విచారానికి కారణం తెలుసుకోవ లెనని ఉంటుంది. కారణం సంతోషానికంటే విచారానికి బరువెక్కువ. పది తులాల సంతోషంతో సరిపోతుంది ఒక్క తులం విచారం.

అయితే చెపుతా వినండి. నేటి పోస్టులో ఒక అందమైన కవరులో అంత కంటే అందమైన కాయితం మీద, ఇంకా అంతకంటే అందమైన అక్షరాలతో లిఖించ బడిన ఒక ఉత్తరం వచ్చింది. ఎంతో ఆతురతతో చించి చూచినప్పటి నుంచీ విచారం పట్టుక పీడిస్తుంది. విచారం నన్ను పట్టుకోకుండా నేను విచారాన్ని పట్టుకొన్నట్లయితే నేను దాన్ని సులభంగా విడిపించు కొనేవాణ్ణి. కాని విచారమే నన్ను పట్టుకోటంతో అది నన్ను వదలిపెట్టటం లేదు.

సరే లెండి, అసలు విచారం ఏమిటో చెప్పకుండా విచార తత్వాన్ని గురించి ఉపన్యాసం ఇస్తారు.

ఊఁ, విచారం గురించే చెపుతా వినండి. ఆ వచ్చిన అందమైన ఉత్తరంలో నాకు ఆనందం ఇవ్వని విషయం ఉన్నది. అదే మంటే వచ్చే నెల మొదటి వారంలో పెద్ద పెద్దలంతా కలసి నాకు ఘన సన్మానం చేస్తారట. కనుక అందుకు నా సంతోషాన్ని వెంటనే తెలియ పరచమని వ్రాశారు. నాకు అసలు ఆ వార్త సంతోషాన్నిస్తేగా వారికి నా సంతోషాన్ని తెలియ పరచటానికి? నాకు కలిగింది విచారం. విచారాన్ని వారికి ఏ విధంగా తెలిపేదా అని విచారిస్తున్నాను. వారి ఉత్సాహంతో నిండిన ఉత్తరానికి ఎటువంటి వ్యతిరేకమైన ప్రత్యుత్త రాన్ని వ్రాసి వారిని నిరుత్సాహ పరచాలో తెలియక విచారిస్తూ కూచున్నాను. ఇంతలో మీరు రానే వచ్చారు. మీరైనా చెప్పండి నా అనంగీకారాన్ని వారికి మృదువుగా అందించే విధానాన్ని.

అదేమిటండీ, సన్మానం, వట్టిసన్మానం కాదు ఘనమైన సన్మానం చేస్తామంటే మీరు ఆనందించటానికి బదులు ఏడుపు ముఖం పెడతారెందుకండీ? మీ ఆనందాన్ని తెలుపుతూ

వెంటనే వారికి టెలిగ్రాం ఇవ్వండి. వారి చిరునామా తెలపండి నేనిస్తాను టెలిగ్రాం.

సైగా ఆ పని చేసి కూచునేరు. ఆ ఘన సమ్మానానికి సరాము నేను అంగీకరించను.

పోనీ, ఘన సమ్మానానికి అంగీకరించక పోతే ఘనం కాని సమ్మానానికి వారిని నేను వప్పిస్తాను. మరి మీరు అందుకైనా అంగీకరిస్తారా?

మీ చమత్కారాన్ని అటు కట్టిపెట్టి నా తిరస్కారాన్ని వారికి లలితంగా తెలిపే ఉపాయాన్ని ఆలోచించండి.

ఎందుకని? వారు మీకు చేస్తామన్నది సమ్మానమే కాని అవమానం కాదు. సమ్మానాన్ని మీరు అవమానంగా తలిస్తే ఎట్లా కుదురుతుంది? సమ్మానం అంటే జీవితం, అవమానం అంటే మృత్యువు. బ్రతుకును చావుగా చూస్తే ఎట్లాకుదురుతుంది?

మీరెన్ని మాటలైనా చెప్పండి, ఆ సమ్మానానికి నేను అనుకూలుడను కాదు. నేను అందరివంటి మనిషిని కానని ప్రగల్భాలు పలకనుకాని అందరూ అంగీకరించి నట్లు నేను సమ్మానాలకు అంగీకరించను. కొన్ని పనులను చేయటంలో కంటే చేయకపోవటంలోనే ఎక్కువ శ్రేయం ఉంటుందని నా నమ్మకం. సమ్మానం చేయించుకోటంలో కంటే చేయించుకోక పోవటంలోనే గొప్ప గౌరవం ఉంటుందని. ఇందుకు ప్రధాన కారణం నన్ను పది మందిలో కూచో బెట్టి నన్ను గురించిన అబద్ధాలు అనేకం పలుకుతారు వేదిక మీద. నేను ఇంద్రుడను కాకపోయినా నన్ను ఇంద్రుడంటారు; చంద్రుడను కాక పోయినా చంద్రుడంటారు.

మీకా భయం అవసరం లేదు. అటువంటి అబద్ధాలు పలక కుండా నేను కట్టు దిట్టం చేస్తాను. మీరు ఏది కాదో దానిని అన నివ్వను. మీరు పండితులు కారు కనుక మీరు పండితులు అనే అబద్ధాన్ని పలకనివ్వను. మీరు దాతలు కారు కనుక మీరు దాతలు అనే అ వాస్తవాన్ని చెప్పనీయను. అటువంటప్పుడు మీకు భయం ఎందుకు? మీరు నిజంగా ఏది అవునో దాన్ని మాత్రమే పలికింప చేస్తాను. మీలో మానవత లేదు కనుక మీరు మానవులు కారు అనే సత్యాన్నే సభలో చాటింప చేస్తాను కాని మీరు మానవులు అనే అసత్యాన్ని ప్రకటింప చేయను. ఈ విధంగా మీలోని నిజాలనే సభలో బయట పెట్టిస్తాను కాని అబద్ధాలను కాదు. కనుక మీకు జరగనున్న సమ్మానం వాస్తవాల సమ్మానమేకాని అబద్ధాల సమ్మానం కాదు. కనుక మీరు అందుకు అంగీకరించి మీ కృత్య స్వరూపాన్ని నేపథ్యంలో నుంచి ఆవిష్కరింప చేసి మీరు ఆనందించి ఇతర్లకు ఆనందాన్ని ప్రసాదించండి. ❋

## 'మిసిమి' అభిమానులకు మనవి

**ఆర్థిక భారం ఎక్కువగా వున్నది. ఎక్కువ కాలం మన్నాలంటే చందాదారులను చేర్పించి సహాయపడ గోరుతాము.**

**— సంపాదకుడు**

# భారతీయ ఆలోచనాధార - మేధాదారిద్ర్యం

- శివలింగం

భారత దేశంలో బౌద్ధికత చరిత్ర తెలుసుకునే ముందు బుద్ధిజీవి అంటే ఏమిటో తెలుసుకోవాలి. జీవితంలోను ప్రపంచంలోను జరిగే విషయాలను పరిశీలించి వాటి కారణాలు అన్వేషించి అన్నిటిని అవగాహన చేసుకుని సూత్రబద్ధం చేసి మానవాళికి ఒక సమగ్ర జీవన దృక్పథాన్ని అందించిన వాడు బుద్ధిజీవి. హేతువాదం, మానవతావాదం బౌద్ధికత (intellectualism) అనవచ్చు. కరుడు గట్టిన సంప్రదాయవాదిలో పిడివాదం గోచరిస్తుంది. మతం హేతుతత్వాన్ని త్రోసిరాజంటుంది. మేధావిలో శాస్త్రీయ దృక్పథం గోచరిస్తుంది.

భారత దేశంలో మతం, తత్వం, రాజకీయం, సాహిత్య కళా రంగాలు కలగలిసి పోయాయి. ప్రథమ సాహిత్య గ్రంథం రుగ్వేదం. రుగ్వేదం పరలోకం గురించి చెపుతుందనడం శుద్ధ అబద్ధం. ద్యావాపృథ్వులను కలిపి స్తుతించారేగాని ద్యుస్ (స్వర్గం, ఆకాశం)ను కీర్తిస్తూ ఒక్క సూక్తం కూడా చెప్పలేదు రుషులు. మోక్షం లేదు. పునర్జన్మ లేదు. నరక ప్రస్తావన లేదు. రుగ్వేదంలో కర్మకాండలు భౌతిక జీవనానందం కోసం సుఖసౌఖ్యాల కోసం చేయబడినవే. పదార్థానికి శక్తికీ భేదం లేదు. రుగ్వేదంలో మానవుడు జీవితం, అనుభవాలు వ్యక్తీకరించబడినాయి. జీవితానికిచ్చిన స్థానం తత్వాని కివ్వలేదు. తాత్వికాలోచన సారహీనంగా వుంది. అక్కడక్కడ వున్న తునకల్ని పట్టుకుని తర్వాత పుట్టిన దార్శనిక దృక్పథాల కన్నిటికీ వేదమే ప్రమాణమని చెప్పడం జరిగింది. రుగ్వేదార్యులు ఆవుమాంసం తిన్నారు. మద్యం సేవించారు. 9వ మండలమంతా సోమదేవస్తుతి. సోమం అంటే గంజాయి. వెన్నెల్లో పెరిగే మొక్కకు రాజు సోముడు. ఒక రుగ్వేద రుక్కులోను రెండు అధర్వ వేద శ్లోకాల్లోను బ్రహ్మాన్వేషకుల ప్రసక్తి వుంది. రుషులంతా వివాహితులే. మహాశాలులు (గృహస్థులు). రుగ్వేదార్యులు వచ్చేనాటికి హరప్పా నాగరికత ఉచ్ఛస్థితిలో వుంది. ఆర్యులు పట్టణాల్ని చూచి ఎరగరు. పశువుల్ని మేపుకుంటూ జీవించే గ్రామీణులు, నవనాగరికతకు విముఖులు, ద్వేషులు. నగరాల్ని ధ్వంసం చేశారు. పురాలను ధ్వంసం చేశాడు కనుక పురందరుడయ్యాడు ఇంద్రుడు. వరుణుడు ఇంద్రుడు అగ్ని హిరణ్యాగర్భుడు విశ్వకర్మ ప్రజాపతి - వీరంతా సృష్టికర్తలుగా కీర్తించబడినారు. యుద్ధాలు చేసి దేశీయుల్ని కొల్లగొట్టారు. నాగరికతను ధ్వంసం చేశారు. అనాటికి వర్ణ వ్యవస్థ లేదు. ఒక యింటిలోనే కొడుకు సూక్తులు కూర్చేవాడు. తండ్రి వైద్యుడు. తల్లి పిండి విసిరేది. సొమ్ము కోసం తలొక వృత్తి చేసుకునే వాళ్లు. ఆ రోజుల్లో పాటలు రాసేవాడికి ఆదాయం వుంది. రుగ్వేదం (10-90) పురుష సూక్తంలో చాతుర్వర్ణ్యం బ్రహ్మసృష్టి అనే భావం వుంది.

బ్రాహ్మణో ముఖ మాసీద్ బాహూ రాజన్య కృతః
ఊరూ తదస్య యద్ వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత.

ముఖం బ్రాహ్మణులు, చేతులు క్షత్రియులు, తొడలు వైశ్యులు, పాదాలు శూద్రులు పుట్టారు. ఈ పురుషసూక్తం ప్రక్షిప్తమని పండితులు. వర్ణ ప్రసక్తి వుంది; అర్థాలు వేరులే అంటే పొసగదు. కందుకూరి వీరేశలింగంగారు పై అర్థాన్ని ప్రతిపాదించదని ఖచ్చితంగా చెప్పారు. ఋగ్వేదంలో బ్రహ్మ అంటే ప్రార్థన స్తుతి అని అర్థం. తరవాత సూక్తాలు కూర్చేవాడిని, పాడేవాడిని బ్రహ్మ అనిపిలుస్తూ వుండటం వలన క్రమస్య వారొక వర్గం గా రూపొందడం జరిగింది. ఋగ్వేద కాలం రాజ్యాల కోసం. ఆధిపత్యం కోసం, వలసల కోసం పోరాటకాలం. వారి నినాదం చరైవేతి, చరైవేతి (పదండి ముందుకు పదండి ముందుకు). కుల మత వర్ణ వర్గాలకు అది సమయం కాదు. స్థిరత్వం, స్థిమితత్వం లేదు. ఋగ్వేదం చివరి మూడు మంత్రాలు సమైక్యతా గీతాలు. భావం యిది:

అందరం కలసి మెలసి పయనిద్దాం
అందరం ఒకే మాట పలుకుదాం.
అందరి ఆలోచన ఒకటే
అందరి లక్ష్యసాధన ఒకటే.

సమానతను సమైక్యతను ప్రబోధిస్తున్నాయి. వేద సంస్కృతి సందేశం 'A happy life in a beautiful world' అని కున్హన్ రాజా. ఋగ్వేద సూక్తాల్లో మంచి కవిత్వం వుంది. భౌతిక జీవితాన్ని ఆనందంగా అనుభవించారు. భారతీయుల్లో లోక నిరాకరణ వైఖరి ఆలోచనలోను జీవితంలోను గణనీయమైన స్థానం ఆక్రమించిందని ఆల్బర్ట్ స్విట్జర్ అభిప్రాయపడ్డాడు. భారతీయుల జీవన విధానం మాత్రం అదికాదన్నాడు సచ్చిదానందమూర్తి. బృహ దారణ్యకం ఛాందోగ్యోపనిషత్తులు ప్రాచీనాలు. ఆ కాలానికి సింధుగంగామైదానాలాక్రమించారు ఆర్యులు. రాజకీయ సామాజిక ఆర్థిక రంగాల్లో మార్పులు వచ్చాయి. చిన్న చిన్న రాజ్యాలు అవతరించాయి. రాజులకు రాజ్య విస్తరణ కాంక్ష బలిసింది. అడవులు నరకడం వ్యవసాయం అభివృద్ధి కావడం వలన కాయకష్టం చేయడానికి అగ్రవర్ణాలు శూద్రుల్ని చండాలురను ఉపయోగించుకుంటున్నారు. సాంఘిక అసమానతలు దారిద్ర్యం, క్షామం సమాజంలో అధిక సంఖ్యాకులు అనుభవిస్తున్నారు. ఇది ఋగ్వేద కాలానికి ఉపనిషత్తుల కాలానికి నడుమ పరిస్థితి. ప్రజల్లో జీవితం పట్ల వ్యతిరేకత ఏర్పడింది. ఉన్న వర్గాలు రాజులు పురోహితులు కలిసి సమాజాన్ని భ్రష్టుపట్టించారు. ప్రజలు పట్నాలు వదలి అడవుల్లోకి వెళ్ళి పోయారు. అక్కడపుట్టాయి ఉపనిషత్తులు. పునర్జన్మ, కర్మ బృహదారణ్యకం నుండి, ఛాందోగ్యం నుండి జనించాయి. యాజ్ఞవల్క్యుడు వెయ్యి గోవులు వాటి కొమ్ములకు కట్టిన బంగారం కోసం అర్థభాగుడ్ని మంచి చేసుకుని కర్మ పునర్జన్మల్ని తయారుచేశాడు (బృహదారణ్యకం– 3–2–13). కర్మ పునర్జన్మలు అందరి ఆలోచనల మీదా ఆధిక్యతను నిలుపుకున్నాయి. దేవుణ్ణయినా నిరాకరించవచ్చుగాని కర్మను నిరాకరించడం ప్రమాదకరంగా భావించడం జరిగింది.

ఉద్దాలకుడు భౌతికవాది. భూతాత్మవాది. అజీవకులు చార్వాకుల కన్నా ప్రాచీనుడు ఉద్దాలకుడు (640–610 క్రీ.పూ) - వేయి వేదాలు వల్లించినా సన్మార్గం తెలియక పోతే లోభిత్వంపోదు. వేదాలు నిరుపయోగం. ఆత్మనిగ్రహం ముఖ్యం. అదే సత్యం. జగత్తు, భగవంతుడు ఒకే నాణెపు బొమ్మా బొరుసులు. ఏకంగావున్న సత్ అనేకం అయిందన్నాడు. యాజ్ఞవల్క్యుడు భావవాది. భౌతిక జగత్తు అసత్యం. బ్రహ్మసత్యం. శుద్ధ చైతన్యమే ఆత్మ అదే ఆనందం. అదే సత్యం. జగత్తు మిథ్య అంటూనే అపార సంపదను కూడ బెట్టి కాత్యాయనికి యిచ్చిపోయాడు. మన మేధావులు యాజ్ఞవల్క్యుని అనుసరించారు కాని

ఉద్దాలకుని అనుసరించక పోవడం వలన మేధాదారిద్ర్యం వేయి పువ్వులుగా వికసించింది. యాజ్ఞవల్క్యునికి ఆత్మ సత్యం. గోవుల కొమ్ములకు కట్టిన బంగారం సత్యం. జగత్తు మిథ్య! యాజ్ఞవల్క్యుడు దురహంకారి, పిడివాది. ఉద్దాలకుడు ప్రయోగవాది, బహిర్ముఖి. చర్చలకు సిద్ధపడే మనస్సు గలవాడు, ఉద్దాలకుని ఆలోచనా ధార సజీవంగా ప్రవహించి వుంటే దేశంలో పసిడి పంటలు పండేవి, వేయి వెలుగులు విరజిమ్మేవి, దేశ చరిత్ర మరొక విధంగా వుండేది.

అందుకే చలం 'ఈశ్వరుడు, కర్మ, నీతి, పునర్జన్మ - వీటిని మరపిస్తేగాని ఇండియా ముందుకు పోదన్నాడు. ఉపనిషత్తుల జ్ఞానమార్గం ఒకవైపు, మరొకవైపు భౌతిక వాదధోరణులు అభివృద్ధి చెందుతూ వచ్చాయి. బుద్ధుడు 80 సంవత్సరాలు జీవించి క్రీ.పూ. 483లో మరణించాడు. దేవుడున్నాడా లేడా అనే అధిభౌతిక ప్రశ్నలకు బుద్ధుడు మౌనం వహించాడు. బుద్ధుని అనంతరం బౌద్ధమతం హీనయాన, మహాయాన మతాలుగా పరిణామం పొందింది. బుద్ధుని బోధలకు దూరమైనాయి. బుద్ధుడు ప్రవచించింది నూతన తత్వమే. జ్ఞానోదయానంతరం లోకసేవ చేసిన మహనీయుడు. రుషులు లోకసేవ చేసిన జాడలేదు. పామరుల మనస్సును పాడుచేయటం యిష్టం లేక అధిభౌతిక ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు బుద్ధుడని రాధాకృష్ణన్ అన్నాడు. నారాయణమూర్తి ఒప్పుకోలేదనుకోండి. సాంఘిక, నైతిక, రాజకీయ దురాగతాలను నివారించడానికి భగవంతునియందు భక్తి గాని ప్రార్థనలు గాని యజ్ఞ యాగాది క్రతువులు గాని తోడ్పడుతాయని, అవిపోవడానికి భగవంతుని ప్రార్థించమని బుద్ధుడు చెప్పలేదు. 200 సంత్సరాల తర్వాత బౌద్ధం మతంగా మారింది. అశోకుడు నాలుగింటిని సంఘ (బౌద్ధం), బ్రాహ్మణ, అజీవక, జైనమతాలను పేర్కొన్నాడు. అశోకుని కాలంలో దేశం విహారాలతో, అరామాలతో దేవాలయాలతో నిండిపోయింది. బౌద్ధం మతస్థాయికి చేరుకుంది. 7వ శతాబ్దంలో హ్యూయిన్ సాంగ్ సందర్శించే కాలానికి బౌద్ధం క్షీణించింది. 6వ శతాబ్దంలో హూణుడు మిహిరకులుడు అనేక బౌద్ధారామాల్ని ధ్వంసం చేశాడు. బౌద్ధసన్యాసుల్ని చంపించాడు.

హిందూమతం పైకి పరమత సహనం చూపించినా నిజజీవితంలో కఠినంగా క్రూరంగా వ్యవహరించింది. వేదాల్ని ప్రశ్నించినందుకు వేనుడ్ని, బ్రహ్మ విద్యనభ్యసించినందుకు శంబూకుడ్ని క్రూరంగా వధించారు. మౌర్యుల్లో చివరివాడైన బృహద్రథుడిని (183 క్రీ.పూ.) తన మిలిటరీ కమాండర్‌గా తన కొలువులో పనిచేసే పుష్యమిత్రుడు వధించి రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు; అశోకుని నిషేధానికి గురైన వాటిని పునరుద్ధరించాడు. అశ్వమేధ యాగం చేశాడు. వైదిక మతం పునరుజ్జీవనం పొందింది. చాళుక్యరాజు ఒకటవ పులకేశి అమరావతిలోని అరామాన్ని ధ్వంసం చేశాడు. బౌద్ధాన్ని నిషేధించాడు. నాగార్జున కొండను నాశనం చేశాడు. శంకరాచార్యుల వారి పర్యవేక్షణలోనే అది జరిగివుండొచ్చు. శ్రీశైల ప్రదేశాలు బౌద్ధులవే. వేదాంతులు బౌద్ధుల్నే కాదు మరెంతమందినో అణిచివేయడం జరిగింది. మక్కలి గోశాల, పురాణ కాశ్యప, అజిత కేశకంబళి, ఫకుధకాత్యాయనా, సంజయ బేలత్తిపుత్త, నిగంఠ నాత పుత్త వంటి భౌతికవాదులంతా వేదాంతులకు ఎదురుద్దీలు. మహాభారతంలో చార్వాకుడు ఎదిరించి నిలిచి ధర్మరాజు రాజ్యపాలనకు అనర్హుడన్నాడు. దుర్యోధనుని స్నేహితుడని, రాక్షసుడని నమ్మించి సజీవదహనం చేశారు పురోహితులు. భౌతిక వాదం ఎంత బలంగా వుందో ప్రాచీన భారతంలో దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ రాసిన లోకాయత గ్రంథం చదివితే బోధపడుతుంది.

భారతీయులకు మూలగ్రంథాలను ఉన్నవి వున్నట్లుగా వుంచడం అలవాటు లేదు.

గ్రంథాలను ఫోర్జరీ చేయడం జాతీయ సంప్రదాయం. జర్మన్ పండితుడైన రుడాల్ఫ్ ఒట్టో భగవద్గీత అసలుసిసలైనది 73 శ్లోకాలన్నాడు. యిప్పుడు 701 శ్లోకాలు. మహాభారతం 8800 శ్లోకాలు ప్రథమంలో. దాన్నే జయ అన్నారు. రెండోసారి రాసేటప్పటికి అది 24000 శ్లోకాలయింది. దీన్నే జయలేక భారత అన్నారు. ప్రస్తుత మహాభారతం 96,836 శ్లోకాలు. ప్రాంతీయ ప్రతులలో కొంచెం భేదం. ఎప్పుడు పెరుగుతూ వచ్చిందో సరిగా తెలియదు. గుప్తుల కాలానికి ముందే జరిగి వుండాలి. గుప్తుల కాలం స్వర్ణయుగం కాదని ఆధునికులంటు న్నారు. అనాటికే ఉత్తమ గ్రంథాలన్నీ వెలువడే వున్నాయి. క్రీ.శ. 4వ శతాబ్దం వరకు మూలగ్రంధాల్లో మార్పులు చేర్పులు జరుగుతూ వచ్చాయి. బుద్ధుడు, మహావీరుడు బ్రాహ్మణుల కంటే ఉన్నత వంశానికి చెందిన క్షత్రియులు. క్షత్రియుల మీద బ్రాహ్మణులు ఆధిపత్యం సంపాదించుకున్న తరవాత వేదాలు ఉపనిషత్తులు కాకండా మిగతా వాటిని మార్చివేశారు. మహాభారతంలోని అనుశాసనిక పర్వంలో బ్రాహ్మణులు రక్షింపబడాలని పూజింపబడాలని వారికి ఆగ్రహం కలిగిస్తే అంతా నాశనం అవుతుందని రాశారు. బ్రాహ్మణు లను చూడకపోవడం వలన అనుసరించకపోవడం వలన శకులు యవనులు కాంభోజులు శూద్రులు కాక తప్పలేదు. బౌద్ధ బోధల్లో దేవుడు లేడు. మహాయానులు బుద్ధుణ్ణి ఉత్సవ విగ్రహస్థాయికి తీసుకువచ్చారు. నాస్తికుడని ప్రచారం చేసిన బుద్ధుడిని అవతారంగా చేర్చుకు న్నారు హిందువులు. మహాయానం అశేషప్రజానీకాన్ని విశేషంగా ఆకర్షించింది. హిందువులకు అసూయ రేకెత్తించింది. బౌద్ధులను దెబ్బతీయటానికి అవతారవాదం ప్రవేశ పెట్టారు. భక్తి సంప్రదాయం వచ్చింది. శూద్రులు వేదాలు వినకూడదు కనుక వారి కోసం పురాణాలు అవతరించాయి.

పార్సీలకు జెండ్ అవెస్తా, బౌద్ధులకు ధర్మపథం, యూదులకు తాల్ముడ్ , క్రిష్టియన్లకు బైబిలు, ముస్లిములకు ఖురాన్ పవిత్ర గ్రంథాలు. కాని భారత దేశంలో అగ్రవర్ణాలకు వేదాలు శూద్రులకు పురాణాలు పవిత్ర గ్రంధాలు. శూద్రులు వేదాలు వల్లించినా, విన్నా కఠిన శిక్షలు విధించాయి ధర్మశాస్త్రాలు. ఈ ద్వంద్వాలోచన, ద్వంద్వ నీతి, ద్వంద్వ వాక్కు- భారతీయ వేదాంతులు ప్రవేశపెట్టారు. 'నీతుల రెండు నాల్కలు సాచి బుసలు కొట్టే నిర్హేతుక కృష్ణ సర్పాలు' జాతిని పట్టి పీడిస్తున్నాయి. షడ్దర్శనాలకు ప్రాధాన్యత మాక్స్ ముల్లర్‌తో పెరిగింది. వాటిని మూడు గ్రూపులుగా విభజించారు. సాంఖ్య యోగాలు, న్యాయ వైశేషికాలు మీమాంస వేదాంతాలు. ప్రస్తుతం షడ్దర్శనాల వివరం గురించి తత్వశాస్త్రం చూడవచ్చు. పూర్వ మీమాంసలో కర్మకాండ తప్ప ఏమీలేదు. దేవుణ్ణి గురించి లేక పోవడం వలన వేదాంత దేశికులు వంటివారు దొడ్డిదారిని మీమాంసలో భగవంతుణ్ణి ప్రవేశపెట్టారని రాధాకృష్ణన్. తత్వం లేదు. పురోహితుల పాఠ్య గ్రంథం మీమాంసకుడైన కుమారిలునితో (8వ శతాబ్దం) మీ మాంసా దర్శనం వేదాంతంలో కలిసిపోయింది. యోగదర్శనం సాధనకు సంబంధించింది. యోగశిక్షణలో ఎనిమిది మజిలీలు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ. ప్రత్యాహార ధ్యానధారణ సమాధులు. శరీరాన్ని దృఢంగా వుంచడం కోసం మనస్సుని నిగ్రహించడం కోసం యోగసాధన. లయ హఠ యోగాలు, కుండలిని, సుషుమ్న, సహస్రారం యివన్నీ అబద్ధాలు. ఆధునిక వైద్య నిపుణులకు కనిపించలేదు. (1) యోగః చిత్త వృత్తి నిరోధకః అంటే సచ్చిదానంద మూర్తి గారి మాటల్లో 'The object of yoga is to murder all thought'. ఆలోచనను చంపడం కోసం మనస్సుకు పరమ శాంతిని కలిగించడం కోసం శరీరాన్ని హింసించక్కరలేదు. యోగం విదేశాల్లో బహుళ ప్రచారంలో వుంది. మహేష్ యోగి వంటివారు బావాతీత ధ్యానం అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశపెట్టి సంపన్ను లయ్యారు.

మనిషిగా జీవించడానికి కావలిసింది ఉన్నతమూ అద్భుతమూ అయినది ఆలోచనా శక్తి. దాన్ని చంపితే మిగిలింది ఆటవికత. యోగం కేవలం వ్యక్తిగతమైన భ్రమ అన్నాడు కుమారిలుడు. విశ్వాసాన్ని రక్షించడం కోసం విచికిత్సను చంపారు వేదాంతులు. షడ్దర్శనాల్లో సజీవంగా నిలిచింది వేదాంతం. బాదరాయణుని బ్రహ్మసూత్రాలు వేదాంత మూలం. శంకరునితో (788-820) విశేష ప్రచారంలోకి వచ్చింది. ఆచార్యులంతా బ్రహ్మసూత్రాలకు తమ వాదానికి బలం కోసం భాష్యాలు రాయాల్సి వచ్చింది. శంకరుడు హిందూ వేదాంతాన్ని ప్రబోధించాడు. ఆచరణలో అంత మేధావీ వర్ణవ్యవస్థను అధిగమించలేక పోయాడు. మాటకు ఆచరణకు పొత్తు కుదరలేదు. శంకరాచార్యుడు కేవలం పండితుడూ, మేధావీను. సాంఖ్య న్యాయ వైశేషికాలు నిరీశ్వర వాదాన్ని ప్రవేశ పెట్టాయి. వేద ప్రమాణాన్ని అంగీకరించ లేదు. సాంఖ్యం అతిప్రాచీనం. సాంఖ్యంలోని ప్రకృతి పురుషుల భావం, స్త్రీ పురుషుల సంయోగంగా మారి తాంత్రిక సాధనల పేరుతో మలినమై పోయింది. సాహిత్యంలో స్త్రీ పురుషుల కలయిక సాంఖ్యంలో ప్రకృతి పురుషులుగాను, వేదాంతంలో జీవాత్మ పరమాత్మలుగాను భావించి శృంగారంతో నింపి తృప్తి పడ్డారు కవులు.

వేదాంతం గురించి దాస్ గుప్తా చెపుతూ అహేతుకమయయిన చతుర్విధ విశ్వాస కుడ్యాల మధ్య బందీ అయిందన్నాడు. అవి 1. వేద విజ్ఞానం అపౌరుషేయం. పరిపూర్ణం. 2. బంధన విముక్తి 3. కర్మ సిద్ధాంతం. 4. పునర్జన్మ.

సత్యాన్ని హేతుబద్ధమైన పరీక్షల ద్వారా తెలుసుకునేది కాదని మొదటి దానిలోనే వుంది. అదే పిడివాదం. ఈ భావం తత్వ శాస్త్రానికి ఆత్మహత్యా సదృశమని ఆధునికులంటున్నారు. పురాణాలనుంచి వచ్చిన భక్తి శక్తివంతంగా నిలిచింది. మంచినే కాదు హానీ కలిగించింది. కొంత వరకు సామాజిక పరిణామానికి తోడ్పడింది. రామానంద, కబీరు, దాదు, బసవ, వేమన, గరీబ్ దాస్, చైతన్యుడు వంటి భక్తులు జాతి మతకుల వర్ణ వర్గ భేదాలకు అతీతంగా ప్రబోధించారు. అస్పృశ్యుల్ని కూడా శిష్యులుగా చేర్చు కున్నారు. నిజంగా వారు చేసిన కృషికి కులమతాలు కూలి పోవాల్సింది పోయి మరిన్ని కులాలు పుట్టాయి. తదనంతర కాలంలో ప్రాంతీయ భాషలు జీవం పోసుకున్నాయి. ఏమైనా భక్తి ఉద్యమం anti intellectual. ఉత్తమ భక్తి సాహిత్యం వెలువడింది అంటున్నారు కాని రసోద్రేకం అదుపుతప్పింది. విశృంఖల శృంగార కవిత్వం భక్తి పేరిట వెలువడింది. పవిత్ర భావన మైల పడింది. చైతన్యుని భక్తి ప్రభావం బెంగాల్ ఒరిస్సాలలో ముమ్మరంగావుంది. మూడు దశాబ్దాల నుంచి విదేశీ దండయాత్రలు నిరోధిస్తూ వచ్చిన కళింగ దేశం ఈ కాలంలో నిరోధించ లేకపోయింది. భారత దేశంలో ఎక్కడ గాఢంగా భక్తి మార్గం వుందో అక్కడ జాతి నిర్వీర్యమయింది. పతనమయింది. భారతీయుల్లో వున్న దురహంకారాన్ని అల్బరూని వర్ణించి పోయాడు. ప్రాచీనుల్లో వున్న విశాల భావం లేదన్నాడు. సంకుచిత స్వభావులన్నాడు. [illegible]కు తిరక్క పోవడం వల్ల ఇలా వున్నారు. తిరిగితే తప్పక మారతారన్నాడు. ఆనో భ[illegible]తవో యంతు విశ్వతః Let noble thoughts come to us from every side అని అనువదించారు. ఋగ్వేదంలో ఇంతగా విశాల భావాన్ని వ్యక్తపరచారు. ఆనాటి భారతీయుల్లో వారి దేశంలో లేనిది ఎక్కడా లేదు. ఎక్కడా లేనిది ఇక్కడ వుంది అనే భావం ఏర్పడింది. ఒక వస్తువు మలినమైనప్పుడు దాన్ని మళ్ళీ శుభ్రపరచి యథాతథంగా వుంచాలన్న కోరిక భారతీయులకు లేదన్నాడు అల్బరూని. ముస్లిముల నుంచి పరదాపద్ధతి స్వీకరించారు హిందువులు. ముస్లిములు కుల వ్యవస్థ స్వీకరించారు.

ఆధునిక యుగం.

హెన్రీ లూయిస్ వివియన్ డిరోజియోతో బెంగాల్లో సాంస్కృతికోద్యమం ప్రారంభం. డిరోజియో 10 ఏప్రిల్ 1809లో జన్మించి 26 డిశంబరు 1831లో మరణించాడు. డిరోజియో కవి మేధావి, వక్త దేశభక్తుడు. చిన్న వయసులోనే మృత్యువు కబళించింది. కవిగా స్వతంత్ర ఆలోచనాశీలిగా మనస్సును వికసింప చేసుకున్నాడు. 17 సంవత్సరాల యువకుడుగా వుండగానే హిందూ కాలేజీలో అధ్యాపకుడుగా చేరాడు. విద్యార్థుల ప్రేమాభిమానాన్ని పొందాడు. తాత్విక దృక్పథంతో చరిత్రను బోధిస్తున్న వాడుగా విల్సన్ పండితుని చేత శ్లాఘింపబడినాడు. బేకన్‌ను మెచ్చాడు. లాక్‌ను గౌరవించాడు. వోల్టేర్, డిడెరాట్ టాంపేన్ హ్యూమ్ వంటి మేధావులను అభిమానించాడు. తాత్విక సందేహవాదాన్ని బలపరచాడు. కాలేజీలోను బయటా రాడికల్ భావాలను ప్రబోధించడం కాలేజీ యాజమాన్యానికి కంట కింపు అయింది. 3 సంవత్సరాల తర్వాత 1826లో కాలేజీ అధ్యాపక పదవి నుండి తొలగించారు. విశృంఖల జీవితానికి అలవాటుపడి ఆంగ్ల విద్యావంతులకు ఆదర్శ ప్రాయుడ య్యాడు. ఆయన మరణానంతరం అనేక అభ్యుదయ సంస్థలు నెలకొల్పడం జరిగింది. రాజా రామ మోహనరాయ్ (1772–1833) ఆధునికతను అందుకున్నాడు. రాయ్ ముస్లిం దుస్తులు ధరించాడు. ఉదార భావవాది. ఆలోచనలో ఉపయోగితావాది. రీజన్‌కు ప్రాధాన్యత యిచ్చాడు. విశ్వాసానికి స్థానం యిచ్చాడు. విగ్రహారాధన వ్యతిరేకి. తాంత్రిక సాధన చేశాడు. వైరుధ్యాలను కలిపి ఏకత్వం కోసం ప్రయత్నం. శాస్త్రీయ మతం (Scientific Religion) అటు మతమూ కాదు ఇటు శాస్త్రమూ కాదు. ఆధునిక శాస్త్ర విజ్ఞానం భారతీయులకు అందించాలనే తపనలో ఆంగ్ల విద్యా బోధన ప్రవేశ పెట్టాలని విశేష కృషి చేశాడు. సతి నిషేధం, బాల్య వివాహాలు మాన్పించడం. విగ్రహారాధన వ్యతిరేకించడం వంటివి సంఘ సంస్కరణలు. శాస్త్రీయ విప్లవానికి మార్గం సుగమం చేయటానికి అడ్డుగావున్న అంధ విశ్వాసాలను, మూఢ ఆచారాలను, బుద్ధిహీన సంప్రదాయాలను నరుక్కుంటూ ముందుకు సాగాడు. బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. నవభారత నిర్మాణానికి ఆధునిక భావాలకు రామ మోహనరాయ్ పాత్ర విశిష్టమైనది. 19వ శతాబ్దానికి మృతప్రాయంగా వున్న భారత దేశం నవశక్తిని సంతరించుకోగలిగింది. రాయ్‌లో మాటకు ఆచరణకు ఆటంకం లేదు. బ్రహ్మ సమాజం హిందూమతానికంటె క్రైస్తవ మతానికి చాలా దగ్గర అనడం నిజం.

రామ మోహనరాయ్ అనంతరం దేవేంద్రనాథ్ టాగూర్, కేశవ చంద్రసేన్, శివనాథ్ శాస్త్రి వంటి మహనీయులు బ్రహ్మ సమాజాన్ని సుస్థిరం చేశారు. ఆత్మ ప్రత్యయం వలన ఆస్తిక్యభావం ఏర్పడుతుందని మహర్షి. సహజ జ్ఞానం వలన ఇహపరాలు గుర్తు ఎరగ వచ్చని కేశవ చంద్రసేన్. మొదటిది విశ్వాసం. రెండోది జ్ఞానం. బ్రహ్మ సమాజం జాతీయ స్థాయికి ఎదిగి మూడు ముక్కలయింది. ఆది సమాజం, నవ విధానం, సాధారణ సమాజం. సామాజిక రుగ్మతలను రూపు మాపటానికి స్త్రీ విద్య విషయాల్లో కళా సాహిత్య రంగాల్లో గణనీయ మయిన పాత్ర నిర్వహించింది. ధనిక బెంగాలీల్లో బ్రాహ్మ సమాజ ప్రభావం ప్రబలంగానే వుంది. ఈశ్వర చంద్ర విద్యా సాగర్ సాంప్రదాయ బ్రహ్మణుడు వేదాంతి కాదు. పూజలతో కాలాన్ని వృథా చేయలేదు. సంశయవాది, నాస్తికవాది అన్నారు. బ్రహ్మ సమాజీయులు చాలా మంది ఆయనకు సన్నిహితులు. కాని సమాజంలో చేరలేదు. రామకృష్ణ పరమహంస దర్శనం కోసం ఎందరో మహానుభావులు పరుగులు తీశారు. కాని ఆయన వెళ్లలేదు. రామకృష్ణుడే ఆయనింటికి వచ్చాడు. ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడలేదు. ఆయన మాటలు విన్నాడు. 'అన్నీ మలినాలే ఒక్క బ్రహ్మం తప్ప' అన్నాడు రామకృష్ణుడు. 'నిజం' అన్నాడంతే.

నిరాడంబర జీవి. పేద ప్రజల అభ్యున్నతికి కృషిచేశాడు, మహామనిషి.

దయానంద సరస్వతి సంస్కృత పండితుడు. ఆర్య సమాజ సంస్థాపకుడు. హిందూ శాస్త్రాలన్నీ ధ్వంసం చేసి వైదిక మతాన్ని స్థాపించాలని తపించాడు. కులమతాలకు నిలయమైన హిందూమతద్వేషి. అరవిందుడు వేదాలను అంగీకరించాడు. అరవిందుని ఆలోచన మార్మికం. ప్రతీకాత్మకం. దయానందుని ఆర్యధర్మంలో మతసహనం వుందా అనేది సందేహమే. పంజాబ్ ఉత్తర ప్రదేశ్ రాజస్థాన్‌లలో ఆర్య సమాజ ప్రభావం బాగా నాటుకుంది. బ్రహ్మ సమాజం కన్నా ఆర్య సమాజం ప్రగతిపథంలో మరో అడుగు ముందుకు వేసింది. ఒకడుగు ముందు వేసి పది అడుగులు వెనక్కు వేయించింది దివ్య జ్ఞాన సమాజం. మత దురాచారాల్ని ఖండించ లేక ఆంగ్ల విద్యా విజ్ఞానాలను ఒప్పుకోలేక సతమతమయే యువకు లకు దివ్య జ్ఞాన సమాజం దిక్కు అయింది. అవతారాలను అంగీకరించింది. ఆచారాలకు ఉపపత్తులు చూపింది. బాలయోగుల్ని, దేవుడమ్మలను, బాబాలను సృష్టించింది. రామకృ ష్ణుడు వివిధ మత సమన్వయం చేసిన మహనీయుడు, వేదాంతాన్ని ప్రబోధించాడు. వారి శిష్యులు అవతార పురుషుడిని చేశారు. వివేకానందుడు పేద ప్రజల కోసం కృషి చేశాడు. రామకృష్ణ మిషన్‌ను స్థాపించాడు. హిందూ సాంప్రదాయానికి విశ్వాసానికి వ్యతిరేకమని సంప్రదాయవాదులు గోల చేసినా లక్ష్య పెట్ట లేదు. పాశ్చాత్యులకు వేదాంతాన్ని భారతీయు లకు భౌతిక చైతన్యాన్ని ప్రబోధించాడు, ప్రథమంగా సోషలిజాన్ని బోధించాడు. Universal Religion అవశ్యకత గురించి తెలియ చేశాడు.

బెంగాలీలో కామ్టే పాజిటివిజం ప్రభావం కనిపించింది. కామ్టే (1798–1857) మానవ శాస్త్రాలు ఆధారంగా పాజిటివిజం ప్రతిపాదించాడు. బౌద్ధికతకు మానవతావాదానికి పాజిటి విజం దోహదపడింది. హిందూ ఆచారాల తాకిడికి నిలవ లేదు. పాజిటివిజం హిందూ మతానికి మరింత విశాల పడటానికి ఉపయోగ పడింది. హిందూ పునరుద్ధరణ వాదానికి సంప్రదాయ విలువలకు వ్యతిరేకంగా పోరాడింది. మహారాష్ట్రలో హేతువాదులు బలంగానే వున్నారు. 19వ శతాబ్దంలో వేదాంతులు లేరు. గోపాలరావు దేశముఖ్, జ్యోతిరావు ఫూలె, గోపాల్ గణేశ్ అగర్కార్‌లు పురోహిత వర్గాన్ని ఎదిరించి నిలిచారు. ఆర్థిక అసమానతలను కులవ్యవస్థను అస్పృశ్యతను, అమానుషత్వాన్ని నిరసించారు. ఆలోచనలో స్వేచ్ఛను అభిలషించారు. అంబేడ్కర్ అభిమానులు పూలే, రెనడేను. రాజకీయ నాయకుల్లో మతాభిమానం జ్యోతిషం సాముద్రికం తంత్రం వగైరాలకు కమిట్ అయిన వాళ్లు ఎక్కువ. ఉదారవాదులు మాత్రం హేతువాదులు. గాంధీ మేధావి కాదు, సైద్ధాంతికుడు కాదు. రెండు శతాబ్దాల నుంచి ఇంత గొప్ప సృజనాత్మక శక్తితో ప్రజాభిమానాన్ని విశేషంగా చూరగొన్న వాడు, కార్యభారాన్ని నిర్వహించిన కర్మవాదీ జన్మించ లేదు. గాంధీ హిందూ, జైన, క్రైస్తవ మతాలను థోరో, టాల్‌స్టాయ్, రస్కిన్, వంటి రచయితల గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. భగవద్గీత పవిత్ర గ్రంథం ఆయనకు. ఎన్నో పుస్తకాలు వందల కొద్దీ వ్యాసాలు కొన్ని వేల ఉపన్యాసాలు జీవితకాలంలో ప్రజలకిచ్చి పోయాడు. డాక్టర్లు హాస్పిటళ్ళంటే ఆయనకు గిట్టదు. నాగరికత ఒక రోగంగా భావించాడు. బీహార్‌లో భూకంపం వచ్చినపుడు అంటరాని తనం అనే పాపం చేయడం వలన వచ్చిందన్నాడు. టాగుర్ అందుకు అభ్యంతరం చెప్పాడు. ప్రకృతిలో జరిగే సంఘటనకూ అంటరానితనానికి సంబంధం లేదన్నాడు. టాగుర్‌కు ఒక లేఖ రాస్తూ ఒకసారి ఆకలితో అలమటించే ప్రజలకు కావలసింది ఒకే పాట శక్తినిచ్చే ఆహారం, కబీరు గీతాలతో వారి ఆకలి బాధను పోగొట్టటం అసాధ్యం అన్నాడు గాంధీ. ఆధునిక నాగరికతకు విముఖుడైనా అంతకు మించిన మానవతా దృక్పథం, నిరాండంబర జీవనం

వుండటం వలన విమర్శకులకు అవకాశం లేదు. పేద ప్రజల పట్ల గాంధీకి అభిమానం వుంది. నిస్వార్థ సేవ చేశాడు. క్రియాశీలి, కార్యోత్సాహి. రవీంద్రునికి దైవం పట్ల విశ్వాసం వుంది. అయినా అది సంకుచితం కాదు. విశ్వ విశాల భావన. ఆయన ఆలోచనలో హేతువంశ బలీయంగానే వుంది. మానవ మతాన్ని ప్రబోధించాడు. భావనలో ఆలోచనలో కవిత్వంలో కొత్త కిటికీలను తెరచాడు. మానవ ప్రగతిని మేధస్సును మానవుణ్ణి నమ్మిన మనిషి రవీంద్రుడు. 20వ శతాబ్దంలో పలువురు విద్యావంతుల్ని ఆకర్షించిన మేధావి ఎం.ఎన్. రాయ్, హేతువాది, రాడికల్ హ్యూమనిజం వ్యవస్థాపకుడు. అజ్ఞానం వలన జనించేది విశ్వాసం. నవ్య మానవతావాదాన్ని ప్రవచించాడు. రాజకీయంగా విఫలమైనా మేధాపరంగా రాయ్ ప్రభావం ఎక్కువే.

దేశంలో అందమైన కొండలు, లోయలు, జీవనదులు, పసిడి పంటలు పండే నేలలు పుష్కలమైన ఖనిజ సంపద యివన్నీ వుండి ప్రపంచంలో అతి పేద దేశంగా ఇండియా పేరు తెచ్చుకుంది. మన దేశీయులెవరో ప్రథమంగా మనకు తెలియదు. ద్రావిడులేననాలి. ఇరాని యన్లు, గ్రీకులు, సిథియన్లు, పారశీకులు, కుషానులు, తురుష్కులు, అరబ్బులు, ఆఫ్ఘన్లు, పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, బ్రిటీషు వాళ్లు మన దేశాన్ని పాలించారు. కొందరు యిక్కడి వెండి బంగారం విలువైన వజ్రాలు, గుళ్ళు దోచుకు పోయారు. మనల్నిగాని మనదేశాన్ని గాని ఏ దేవుడూ రక్షించ లేదు. జాతి నిర్వీర్యమయింది. ప్రత్యక్షాన్ని పట్టించుకోలేదు. భౌతిక చైతన్యాన్ని విస్మరించారు. స్వతంత్ర బుద్ధితో హేతు వివేచనతో భౌతికాన్ని భౌతికావసరాన్ని గుర్తించి వుండలేదు. సృజనాత్మక హృదయం వుంటే వసుధైక దృక్పథం కలుగుతుంది. మన ఆలోచనాధార ఆదిలోనే తప్పుదారి పట్టింది. ఉద్దాలకుని భూతాత్మ వాదాన్ని అనుసరించి వుంటే దేశ ప్రగతి మరొక విధంగా వుండేది. చారిత్రక పరిస్థితుల్లో జన్మించిన మహనీయుల అడుగుజాడలు వారితోనే చెరిగి పోయాయి. బుద్ధుడు ఈనాడు జన్మించినా భారతదేశమని గుర్తించ గలడనడంలో అతిశయోక్తి లేదు. ఆనాటి ఆచారాలు వివాహ పద్ధతులు కర్మకాండలు మారలేదు. వేదాంతాన్ని కాదని ఏతాత్విక ధోరణీ బ్రతికి బట్ట కట్ట లేదు. స్వార్థపరులు తమ ఉనికి కోసం మనుగడ కోసం హేతువాదుల్ని అణచివేశారు. భౌతిక ప్రపంచాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్రజలకు విద్య - గాలి, నీరులాగ - ఆంగ్లేయుల వల్లనే లభించింది. అజ్ఞానంలో ప్రజల్ని వుంచి పాలక పురోహిత వర్గాలు దేశాన్ని ప్రజల్ని దోచుకున్నారు. సూర్యుని మీద లెక్కలు కట్టి చివరకు సూర్య స్తోత్రం ఆరంభించడం చూస్తే తెలుస్తుంది మన మనస్తత్వం. భౌతిక ఆధ్యాత్మికాభివృద్ధిని పాశ్చాత్యులు సాధించారు. భారతదేశం రెంటికీ చెడింది. లోతైన విచారణ చేయకుండా ఉపరితలాన్ని మాత్రం స్పృశిస్తూ భారతీయుల చింతనను సమీక్షించడం జరిగింది. నవద్వీపంలో నవ్యన్యాయ దర్శనం వలన కూడా ఆరిస్టాటిలు వేసిన ఒకడుగు మాత్రమే వేయగలిగింది. ఈ విషయం ఇంకా విపులంగా పరిశీలించే పండితులకు మేధావులకు ప్రేరణ కలిగించ గలదని ఆశ. ★

"Whether it be pollution of the physical environmental or decay of political structure, there is no lack of knowledge, but rather a lack of will and honesty"

సమీక్ష:

# ప్రేమించడం ఒక కళ

**Art of Loving**
**By ERICH FROMM** — అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

ప్రేమ, లైంగికతలపై మరికొంత చర్చకు స్త్రీ, పురుష ధృవాభిముఖత దోహదం చేస్తుంది. ఇంతకుముందు ఫ్రాయిడ్ చేసిన తప్పిదాన్ని గురించి చెప్తాను. ప్రేమలో లైంగిక సహజాతం ఉదాత్తీకరణం (sublimation) చెందుతుంది తప్ప మరొకటి కాదు అన్నాడు. ప్రేమ, సంలీనాల అవశ్యకతను లైంగికవాంఛ వ్యక్తం చేస్తుందన్నమాట అతడు మరిచిపోయాడు. కాని ఫ్రాయిడ్ తప్పు ఇంకా లోతైంది. శారీరక- భౌతిక వాదానుగుణంగా, శరీరంలో రసాయనికంగా జనించిన ఉద్రేకఫలితంగా లైంగికసహజాతాన్ని అతడు అర్థం చేసుకున్నాడు. ఆ ఉద్రేకం చాలా బాధాకరమైందనీ, అది ఉపశమనాన్ని అన్వేషిస్తుందని అతడు భావించాడు. లైంగిక వాంఛ ధ్యేయం బాధాకరమైన ఉద్రేకాన్ని ఉపశమింపజేయడము. ఈ ఉపశమనాన్ని సాధించడంలో లైంగికతృప్తి ఉంది. ఈరకం దృష్టి ఎంతవరకు సరైనదంటె, తిండితినకపోతే ఆకలివేసినట్లే లైంగికవాంఛ పనిచేస్తుందని చెప్పడంలాగుంది. ఈ దృష్టిలో లైంగికవాంఛ ఒకరకమైన దురద, లైంగిక తృప్తి అంటే దురదపుట్టినప్పుడు గోకుకోవడం వంటిది. వాస్తవంగా ఇటువంటి లైంగిక భావనకు సంబంధించినంతవరకు ముష్టిమైథునం (masturbation) ఆదర్శవంతమైన తృప్తి. ఫ్రాయిడ్ మరిచిపోయింది ఏమంటే: లైంగికతను మానసికంగా జైవికం (Psychobiological)గా పరిశీలించడం, స్త్రీ-పురుష ధృవాభిముఖత, సాయుజ్యంద్వారా ఈ ధృవత్వానికి సేతువును వేయడము. ఫ్రాయిడ్ దీని మరిచిపోయాడనటం యుక్తంకాదు. ఆశ్చర్యకరమైన ఇటువంటి దోషం దొర్లడానికి కారణం అతడు కులీన వ్యవస్థను దాటి చూడలేకపోవడమే. ఈ కులీనవ్యవస్థ లైంగికత అనేది పురుషునికి మాత్రమే చెందినదనే భావాన్ని అతనిలో కలుగజేసింది. అందువలన విశిష్టమైన స్త్రీ లైంగికతను అతడు పట్టించుకోలేదు. ఈ విషయం అతడు వ్రాసిన ''లైంగిక సిద్ధాంతం మీద మూడు వ్యాసాలు'' చూస్తే అర్థమవుతుంది. లిబిడో (libido) స్త్రీలో ఉన్నా పురుషునిలో ఉన్నా అది పురుష ప్రవృత్తినే వ్యక్తం చేస్తుందంటాడు అతడు. ఇదేభావం ఫ్రాయిడ్ సిద్ధాంతములో మరొకచోట యుక్తిసహజమైన రూపంలో దర్శని మిస్తుంది: చిన్న పిల్లవాడు స్త్రీని గింజలుతీసిన (వృషణవిచ్ఛేదనం గావించబడిన) మగవానిగా భావిస్తాడు. కాని స్త్రీ గింజలు తొలగించబడిన పురుషుడు కాదు. ఆమె లైంగికతలో 'స్త్రీ ప్రవృత్తి' తప్ప 'పురుష స్వభావం' లేదు.

స్త్రీ పురుషుల మధ్య ఉండే లైంగిక ఆకర్షణకు కొంతవరకు క్షుధను తీర్చవలసిన 'అవసరము' కారణం. ఆ అవసరం ముఖ్యంగా రెండవ ధృవంలో ఐక్యం కావడము. వాస్తవానికి, కాముక ఆకర్షణ (Exotic Attraction) ఒక్క లైంగికాకర్షణలోనేకాక, ఇతరత్రా గూడ వ్యక్తమవు తున్నది. (మానవ) ప్రకృతిలో (Character) లైంగిక వ్యాపారం ఒక్కటే కాకుండ స్త్రీత్వము, పురుషత్వముగూడ ఉన్నాయి. పురుష ప్రవృత్తి అంటే గుచ్చుకుపోవడం, మార్గ నిర్దేశకత్వం, క్రియాశీలత, నిగ్రహం, సాహసికత లక్షణాలు కలిగి ఉండటమని చెప్పవచ్చు. స్త్రీ ప్రవృత్తి అంటే ఉత్పాదనకోసం పరిగ్రహించడం (స్వీకరించడం) రక్షణ, వాస్తవికత, సహిష్ణుత,

మాతృత్వం లక్షణాలు కలిగి ఉండడమని చెప్పవచ్చు. (ప్రతి వ్యక్తిలోను- ఆడగాని, మగగాని- రెండు స్వభావ లక్షణాలు సమ్మిశ్రితమవుతాయని, ఆ మిశ్రమంలో ''అతనివి'' లేదా ''ఆమెవి'' అనదగిన లక్షణాలు ఎక్కువ పాళ్ళలో ఉంటాయని మరువరాదు). ఒక్కొక్కప్పుడు ఒకడు శారీరకంగా మామూలుగానే పెరిగి ఔద్వేగంగా మాత్రం పసిపిల్లవాడైపోతాడు. అలాంటప్పుడు అతనిలో పురుషప్రవృత్తి లక్షణాలు బలహీనమైపోయినప్పుడు, చాల తరుచుగ, ఈ లోపాన్ని పూరించడానికి అతడు లైంగికతలో తన 'పురుషపాత్ర'కు అత్యంత ప్రాధాన్యతనిస్తాడు. ఫలితంగా అతడు డాన్ జాన్ (Don jawn) అవుతాడు. లైంగికంగా అతడు తన మగతనాన్ని పైకి నిరూపించకోవలసి ఉంటుంది. ఎందుకంటే లోలోపల అతని పురుషత్వం మీద అతనికి నమ్మకం లేదు (శారీరకంగా లైంగిక సామర్థ్యాన్ని నిరూపించుకోవచ్చు. అది వేరు సంగతి). పుంస్త్వ పక్షపాతం (మగతనం మీద అపనమ్మకం) మితిమీరినప్పుడు పరపీడనకామం అంటే విపర్యయస్థితి - మగతనానికి ప్రత్యామ్నాయం - ముఖ్యమైపోతుంది. స్త్రీ లైంగికత బలహీనపడినా, విపర్యయం చెందినా, అది స్వపీడనకామంగా లేదా వశవర్తిత్వం (Submission) గా రూపాంతరం చెందుతుంది.

ఫ్రాయిడ్ లైంగికతకు అధిక ప్రాధాన్యతనివ్వడం వల్ల సనాతను లతనిని విమర్శించారు. ఫ్రాయిడ్ సిద్ధాంతాలలో కొంత భాగమే వీరి విమర్శకు గురైంది. ఆ విమర్శకు గురైన కొంతభాగాన్ని ఫ్రాయిడ్ తొలగించినట్లయితే, వారతనిని అసలు విమర్శించేవారేకాదు. ఫ్రాయిడ్ ఈ విషయాన్ని పసికట్టాడు. ఆ కారణంగానే తన లైంగిక సిద్ధాంతాన్ని మార్చాలనే ప్రతి ప్రయత్నాన్ని అతడు అడ్డుకొన్నాడు. నిజంగా ఫ్రాయిడ్ కాలంలోనే అతని సిద్ధాంతం విప్లవాత్మకంగా అన్నింటిని సవాలుచేసింది. కాని 1900ల ప్రాంతంలో యథార్థమైంది ఏభై సంవత్సరాల అనంతరం గూడ నిజం కావాలని లేదు. లైంగిక కట్టుబాట్లలో ఎంతో మార్పు వచ్చింది. పాశ్చాత్య ప్రపంచంలోని మధ్యతరగతికి ఆ మార్పు ఏమాత్రం దిగ్భ్రాంతి కలిగించలేదు. ఫ్రాయిడ్ లైంగిక సిద్ధాంతాలను మేము ఎంతో ధైర్యంగా బలపరుస్తున్నామని కొందరు సనాతన విశ్లేషకులు చెప్పుకోవడం చూస్తే నవ్వువస్తుంది. వాస్తవానికి, వారి విశ్లేషణ సమాజానుగుణమైనదేకాని సమకాలీన సమాజ విమర్శకు కావలసిన మనో వైజ్ఞానిక ప్రశ్నలను లేవనెత్తేది కాదు.

నేను ఫ్రాయిడ్ ని విమర్శించేది అతడు లైంగికతకు ప్రాముఖ్యతనిచ్చాడని కాదు; అసలు అతడు లైంగికతను లోతుగ అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాడనే నా వ్యథ అంతా. వ్యక్తికి వ్యక్తికి మధ్య ఉండే వాంఛల ప్రాముఖ్యతను గుర్తించడంలో మొదటి అడుగు వేసినవాడు ఫ్రాయిడే. అతని తాత్త్విక దృక్పథం ప్రకారం వాటిని శారీరకపరంగా వివరించవలసి వచ్చింది, వివరించాడు. ఫ్రాయిడ్ కనుగొన్న నూతన విషయాలను శారీరక రంగంనుంచి జీవశాస్త్ర రంగానికి, అక్కడనుంచి సత్తా పరిధికి అనువదించి, ఫ్రాయిడ్ సిద్ధాంతాలను సరిదిద్ది పెంచితేనే గాని మనోవిశ్లేషణను ఇంకా విస్తృతం చేయడానికి వీలులేదు.

## తల్లి-బిడ్డ ప్రేమ

ప్రసవ సమయంలో, తల్లి గర్భంనుంచి బిడ్డ భూమిమీద పడేటప్పుడు, గర్భస్థ జీవితం నుంచి బాహ్య ప్రపంచంలోనికి అడుగిడేటప్పుడు, కలిగే వ్యాకులతను, ఏ అదృష్టదేవతో అ శిశువుకు తెలియకుండ చేయబట్టే సరిపోతుందికాని లేకపోతే మరణభీతితో ఆ శిశువు విహ్వాలమైపోతుంది. శిశువుకు సంబంధించినంతవరకు పుట్టేప తరువాత స్థితి పుట్టకముందు

స్థితికి వేరుగా ఉండదు; అది వస్తువులను గుర్తించలేదు. తనను గురించి తనకు తెలియదు; బయట ప్రపంచాన్ని గురించి తెలియదు. వెచ్చదనం, ఆహారాల ఉద్దీపనం మాత్రమే తెలుసు. కాని వెచ్చదనానికి, ఆహారానికి మూలమైన తల్లి వాటికంటే భిన్నమైందని తెలియదు. తల్లే వెచ్చదనం, తల్లే ఆహారం, తల్లే తృప్తి, భద్రత. ఫ్రాయిడ్ భాషలో చెప్పాలంటే ఇదే స్వానురాగము (Naracissism). తన శరీరానికి ఏది సుఖాన్నిస్తుందనే దానిమీద ఆధారపడి మాత్రమే బాహ్యప్రపంచం, వ్యక్తులు, వస్తువులు బిడ్డకు అర్థమవుతాయి. నా అవసరం (లోపలి ప్రపంచం) మాత్రమే వాస్తవము; నా అవసరాలు తీరడాన్నిబట్టే బయటిప్రపంచం వాస్తవం గాని, అవాస్తవంగాని అవుతుంది. అంతేగాని దాని స్వతఃసిద్ధ గుణాల మీద ఆధారపడికాదు.

బిడ్డ పెరిగి పెద్దవుతున్న కొలది వస్తువులను యథాతథంగా గ్రహించే సామర్థ్యం అబ్బుతుంది. ఆహారం గ్రహించడం వలన కలిగే తృప్తి వేరు, స్తనంవేరని, స్తనం తల్లికాదని బిడ్డ గ్రహిస్తుంది. చివరకు ఆకలిదప్పులు, వీటిని తీర్చే పాలు, స్తనం, తల్లి వేరు వేరని గుర్తించే దశ వస్తుంది. చాల వస్తువులు వేరువేరని, వాటికి స్వతఃసిద్ధమైన స్వతంత్రమైన ఉనికి ఉన్నదని బిడ్డ తరవాత తరవాత గ్రహిస్తుంది. ఈ దశలో అది వాటికి నామకరణం చేయడం నేర్చుకొంటుంది. అదే సమయంలో వాటితో ఎలా వ్యవహరించాలో నేర్చుకొం టుంది. నేను తింటే అమ్మ సంతోషిస్తుంది, ఏడిస్తే చేతులలోకి తీసుకొని లాలిస్తుంది; నేను మలవిసర్జన చేస్తే నన్ను ప్రశంసిస్తుంది. ఈ అనుభవాలన్నీ నేను ప్రేమించ బడ్డాను అనే అనుభవంలో ఘనీభవించి సమైక్యమైపోతాయి. నేను అమ్మబిడ్డను గనుక నన్ను ప్రేమిస్తుంది. నేను అందంగా ప్రశంసనీయంగా ఉన్నాను గనుక నన్ను ప్రేమిస్తుంది. అమ్మకు నా అవసరం ఉంది కనుక నన్ను ప్రేమిస్తుంది. దీనినే సామాన్యసూత్రంలో చెప్పాలంటే: నేను ఏమిటో దానికే నన్ను ప్రేమిస్తుంది. ఇంకా సరిగా చెప్పాలంటే నేను ఉన్నాను గనుక నన్ను ప్రేమిస్తుంది. ఈ విధంగా తల్లిచే ప్రేమించబడడం నిష్క్రియాత్మకము. ప్రేమించబడడానికి నేను చేయవలసింది ఏమీలేదు. తల్లి ప్రేమకు షరతులు లేవు. నేను చేయవలసిందల్లా ఉండడమే– ఆమె బిడ్డగా ఉండడమే. తల్లి ప్రేమ ఆనందం (Bliss), శాంతి (peace). దీనిని కష్టపడి ఆర్జించవలసిన పనిలేదు. దీనికి పాత్రత అవసరం లేదు. కాని షరతులులేని తల్లిప్రేమకు రెండవప్రక్క గూడ ఉంది. తల్లి అర్హతలు చూచి ప్రేమించదు. తల్లి ప్రేమను పొందాలన్నా, ఉత్పత్తి చేయాలన్నా, అదుపులో ఉంచాలన్నా సాధ్యమయ్యే విషయం కాదు. అది అక్కడ ఉండడమే దీవెన. అది లేకపోతే జీవితంలో అందమే లేదు. అది లేకపోతే నేను చేయగలిగింది గూడ ఏమీ లేదు.

చాలమంది పిల్లలకు, ఎనిమిదిన్నర పదిసంవత్సరాలకు ముందు సమస్యల్లా ప్రేమించబడ డమే - ఉన్నవాడు ఉన్నట్లుగా (యథాతథంగా) ప్రేమించబడడమే. ఈ వయస్సు వచ్చేవరకు బిడ్డకు ప్రేమించడం తెలియదు. ప్రేమించడం వలన సంతోషంగా కృతజ్ఞతా పూర్వకంగా ప్రతిస్పందిస్తాడు. ఈ పరిణామదశలో నూతన కారకం ఒకటి రంగంలోకి ప్రవేశిస్తుంది. తన క్రియాశీలత వల్ల ప్రేమను జనింప చేయవచ్చుననే కొత్త అనుభూతి మొదటిసారిగ బిడ్డ తల్లికిగాని (తండ్రికిగాని) ఏదైన తయారుచేసి పద్యంకాని, బొమ్మకాని, మరేదైన - ఇవ్వాలనుకొంటాడు. బిడ్డజీవితంలో ప్రథమంగా ప్రేమభావన - ప్రేమించబడడం నుంచి ప్రేమించడానికి, ప్రేమను పుట్టించడానికి - రూపాంతరం చెందుతుంది. ఈ రకమైన మొదటి అంకురంనుంచి ప్రేమ పరిపక్వం కావడానికి చాల సంవత్సరాలు పడుతుంది. చివరకు

బిడ్డ, ఇప్పుడు యౌవనుడయ్యాడు కనుక, అహంకేంద్రత (Ego centricity)ను అధిగమిస్తాడు. రెండవవ్యక్తి ఇక ఏమాత్రం తన అవసరాలను తీర్చే ఉపకరణం కాదు. తన అవసరాలు ఎంతముఖ్యమో, ఎదుటివాని అవసరాలు అంతే ముఖ్యమైనవి. వాస్తవానికి అవి మరింత ముఖ్యమైనవి. దానం, స్వీకారంకంటె ఎక్కువ తృప్తిగా ఉంటుంది, ఎక్కువ సంతోషంగా ఉంటుంది. ప్రేమించబడడం కంటే ప్రేమించడం ముఖ్యమవుతుంది. ప్రేమించడం ద్వారా ఒంటరితనం నుంచి, ఏకాకితనం అనే జైలునుంచి బయటపడతాడు. ఈ జైలుగది స్వానురాగం (Naracissism), స్వార్థకేంద్రీకరణం (self-centeredness)లతో నిర్మితమై ఉంటుంది. అతడు నూతన సాయుజ్యంలో, ఇతరులతో అనుభవాలను పంచుకోవడంలో, ఇతరులతోడి ఏకత్వంలో కొత్త అర్థాన్ని అనుభవిస్తాడు. ప్రేమించడంలో పరిగ్రహణముంటుంది. తద్వారా ఆలంబనం ఏర్పడుతుంది. ఈ ఆలంబనం కోసం వ్యక్తి ఎప్పుడు నిస్సహాయుడుగా, రోగిగా, పసివాడుగా, లేక ''మంచి'' వాడుగ ఉండాలి. కాని అతడు ఇటువంటి అనుభవాన్ని వలదని అంతకంటె ఎక్కువగ ప్రేమ ద్వారా ప్రేమను పుట్టించడంలో ఉన్న మజాను అనుభవంలోకి తెచ్చుకొంటున్నాడు. శైశవ ప్రేమ అనుసరించే సూత్రం ఇది: ''నేను ప్రేమిస్తాను, ఎందుకంటె నన్ను ప్రేమిస్తారు.'' పరిపక్వ ప్రేమ ఇలా ఉంటుంది: ''నన్ను ప్రేమిస్తారు ఎందుకంటే నేను ప్రేమిస్తాను.'' అపరిపక్వ ప్రేమ ఇలా అంటుంది; ''నేను నిన్ను ప్రేమిస్తాను ఎందుకంటె నీ అవసరం నాకుంది.'' పరిపక్వ ప్రేమ ఇలా అంటుంది: ''నీ అవసరం నాకుంది ఎందుకంటె నేను నిన్ను ప్రేమిస్తాను.''

ప్రేమాస్పదవస్తువికాసం ప్రేమ సామర్థ్య వికాసంతో అత్యంత సన్నిహితంగా ముడిపడి ఉంది. మొదటి నెలలు, సంవత్సరాలలో బిడ్డకు అత్యంత సన్నిహిత అనుబంధం తల్లితో ఉంటుంది. ఇప్పుడు తల్లి బిడ్డ భౌతికంగా వేరైనప్పటికి ఈ అనుబంధం వారిద్దరు ఒకటిగా ఉన్నప్పుడే - అంటే శిశువు గర్భంలో ఉన్నప్పుడే - ఆరంభమవుతుంది. జననంతో పరిస్థితి కొంతవరకు మారుతుంది. కాని పైకి కనిపించినంతగా మారదు. బిడ్డ, ఇప్పుడు గర్భాశయానికి వెలుపల జీవిస్తున్నప్పటికీ తల్లిమీద పూర్తిగా ఆధారపడి ఉంటాడు. కాని బిడ్డ దినందినం స్వతంత్రుడవుతూ ఉంటాడు. నడవడం, మాటాడడం, స్వతంత్రంగా ప్రపంచాన్ని అన్వేషించడం, పరిశోధించడం నేర్చుకొంటాడు; క్రమంగా తల్లితోడి సంబంధంలో 'జీవం' తగ్గిపోయి తండ్రితోడి సంబంధంలో 'వెచ్చదనం' పెరుగుతుంది.

మాతృకేంద్రాన్ని త్యజించి పితృకేంద్రాన్ని ఆశ్రయించిన ఈ సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి తల్లిదండ్రుల ప్రేమలలోని తారతమ్యాన్ని గమనించాలి. తల్లిప్రేమను గురించి ముచ్చటించాము. తల్లి బిడ్డను, తన బిడ్డను ప్రేమిస్తుందే తప్ప, ఆ బిడ్డలో గుణగణాలను చూచి కాదు. (నేను ఇక్కడ తల్లిప్రేమ, తండ్రిప్రేమలను గురించి మాట్లాడుతున్నానంటే, - మాక్స్‌వెబర్ అర్థంలో లేదా యూంగ్ మూలరూపాల (Archetypes) లో - ''ఆదర్శరూపాల'' (ideal types) ప్రేమను అర్థంచేసుకోమని చెబుతున్నాను. అంతేకాని ప్రతితల్లి, తండ్రి అదేవిధంగా ప్రేమిస్తారని నా ఉద్దేశం కాదు. పితృసదృశ, మాతృసదృశ వ్యక్తులలో ప్రదర్శితమయ్యే పితృ మాతృ లక్షణాల్ని నేను ఇక్కడ చెబుతున్నాను.) ఒక బిడ్డ విషయంలోనే కాదు; ప్రతి మానవుని విషయంలోను షరతులులేని ప్రేమ మానవుని అంతరాంతరాలనుంచి జనించే తీవ్రతృష్ణను పోలి ఉంటుంది. ఒక ప్రత్యేక గుణం, అర్హత లేదా పాత్రత కారణంగా ప్రేమించబడితే, ఆ ప్రేమలో శంకకు చోటు ఉంటుంది. నన్ను ఆ వ్యక్తి ప్రేమిస్తే బాగుండునని

నేను అభిలషించిన ఆ వ్యక్తిని బహుశ తృప్తిపరచలేమోనన్న సందేహము, లేదా మరొక కారణం వల్ల ప్రేమ మాయమవుతుందేమో నన్న భయం ఉంటాయి. ఇంక, వ్యక్తిని వ్యక్తిగా కాక, అతడు సంతోషపెడుతున్నాడనే కారణంతో ప్రేమించడం జరుగుతుంది. చివరిదాక విశ్లేషించి చూస్తే అతనిని ప్రేమించడం లేదు, ఉపయోగించుకొంటున్నామని తేలుతుంది. ''అర్హతల మీద ఆధారపడిన ప్రేమ'' (deserved love) ఈ చేదు అనుభూతినే ఇస్తుంది. పిల్లలుగ, పెద్దవారమైన తరువాత గూడ తల్లిప్రేమను అంటిపెట్టుకొని ఉండాలని అభిలషిస్తాము. తల్లిప్రేమను (ఎంతవరకు అనేది తరవాత చర్చిద్దాము) పొందిన పిల్లలు నిజంగా అదృష్టవంతులు. పెరిగి పెద్దవారైన తరవాతగూడ ఈ అభిలాష నెరవేరాలంటే కష్టమైన విషయము. అత్యంత సంతృప్తికరంగా పెరిగిన వారి కాముకప్రేమలో ఈ అభిలాష ఒక ఇటుక అవుతుంది; తరుచు ఇది మత, ధర్మ రూపాలలో, అంతకంటె ఎక్కువగా న్యూరోటిక్ రూపాలలో అభివ్యక్తమవుతుంది.

తండ్రితో సంబంధం పూర్తిగా భిన్నమైంది. తల్లి అంటే మనం జనించిన గృహం, సముద్రం, ప్రకృతి, నేల. తండ్రి అటువంటి సహజమైన గృహాన్ని ప్రతిబింబించడు. మొదటి సంవత్సరాలలో బిడ్డకు తండ్రితో పెద్దగా సంబంధం ఉండదు. ప్రథమదశలో పిల్లవానికి సంబంధించినంత వరకు, తండ్రి ప్రాముఖ్యతను తల్లిప్రాముఖ్యతతో పోల్చడానికి వీలులేదు. కాని, తండ్రి ప్రాకృతిక ప్రపంచాన్ని ప్రతిబింబించక పోయినా అతడు మానవుని ఉనికి యొక్క రెండవ ధృవాన్ని ప్రతిబింబిస్తాడు. ఆలోచనా ప్రపంచాన్ని, మానవకల్పిత ప్రపంచాన్ని, చట్టాన్ని, న్యాయాన్ని, శిక్షను, ధర్మాన్ని, యాత్రలను, సాహసాన్ని తండ్రి ప్రతిబింబిస్తాడు. పిల్లవానికి బోధన చేసేది, అతనికి ఈ ప్రపంచంలోకి దారి చూపించేది తండ్రే.

ఈ వికాసంతో సన్నిహితంగా ముడిపడి ఉన్నది సాంఘిక - ఆర్థిక వికాసము. వ్యక్తిగతమైన ఆస్తి ఏర్పడి, వంశపారంపర్య హక్కులు లభించిన తరువాత, తండ్రి తన ఆస్తిని అందివ్వడానికి తన వారసుడైన కొడుకు కోసం చూడడం ప్రారంభిస్తాడు. సహజంగానే తండ్రి, ముమ్మూర్తుల తనను బోలిన కొడుకునే తనకు తగిన వారసునిగా ఎంచుతాడు. ఈ కారణంవల్ల తండ్రికి కొడుకంటే మక్కువా ఏర్పడుతుంది. తండ్రి ప్రేమ సోపాధికము (షరతులతో కూడినది). దాని సూత్రం ఇలా ఉంటుంది. ''నా ఆశలకు ఆశయాలకు అనుగుణంగా మసలు కొంటున్నావు కనుక, నీ విధి నీవు నిర్వహిస్తున్నావు కనుక, నీవు నను బోలి ఉన్నావు కనుక, నేను నిన్ను ప్రేమిస్తున్నాను''. షరతులు లేని తల్లి ప్రేమలో వలె షరతులున్న తండ్రి ప్రేమలో రెండు అభిముఖ పక్షాలుంటాయి. ఇందులో ప్రతికూల పక్షం తండ్రి ప్రేమకు పాత్రత కావాలి. ఆశించింది నెరవేర్చకపోతే ప్రేమ దక్కదు. పితృప్రేమ స్వభావం ప్రకారం విధేయత మంచిగుణం. అవిధేయత పాపం - దానికి శిక్ష పితృప్రేమ ఉపసంహరణ - అవుతుంది. రెండవదైన అనుకూల పక్షం, అంతేముఖ్యమైంది. అతని ప్రేమ సోపాధికం కనుక దానిని పొందడానికి నేను ఏదో కొంత చేయాలి. దానిని ఎలాగైన సాధించాలి, తల్లి ప్రేమలాగ తండ్రిప్రేమ నా అదుపుకు వెలుపలలేదు.

బిడ్డయెడ తల్లిదండ్రుల దృక్పథాలు అతని అవసరాలకు అనుగుణంగానే ఉంటాయి. తల్లి నిరుపాధిక ప్రేమ బిడ్డకు కావాలి. మానసికంగా శారీరకంగా ఆమె ఆపేక్ష కావాలి. ఆరేళ్ళు నిండినతరువాత బిడ్డ తండ్రి ప్రేమను అతని ఆధిపత్యాన్ని, మార్గనిర్దేశకతను కోరనారంభిస్తాడు. జీవితంలో బిడ్డకు భద్రత చేకూర్చడం తల్లిపని అయితే, సమాజం

తెచ్చిపెట్టే సమస్యలను ఎలా ఎదుర్కొవాలో నేర్పడం, దారి చూపడం తండ్రివంతు. ఆదర్శ మాతృప్రేమ బిడ్డ పెరుగుదలను అరికట్టదు. అతని నిస్సహాయతకు మూల్యాన్ని విధించకూడదు. తల్లికి జీవితం మీద నమ్మకం ఉండాలి. అలాగని అతివ్యాకులతను ప్రదర్శించరాదు. ఆమె తన వ్యాకులతను పిల్లవానికి వ్యాపింపజేయరాదు. బిడ్డ పెరిగి పెద్దవాడై, స్వతంత్రుడై అంతిమంగా తననుంచి విడిపడి పోవాలని తల్లి కోరుకోవాలి. తండ్రి ప్రేమ సూత్రబద్ధమై ఉండాలి. దానిని ఆశలు నిర్దేశించాలి. ఆ ప్రేమలో బెదరింపు, సాధింపులు ఉండరాదు. అది క్షమాసహిష్ణుతలతో కూడినదై ఉండాలి. ఎదిగే బిడ్డకు ఆ ప్రేమ ఆత్మవిశ్వాసాన్ని కలిగించేదిగా ఉండాలి. చివరకు అతనిని స్వాయత్తునిగా, తండ్రి అధికార మార్గనిర్దేశకాలతో పని లేకుండ పెరిగేట్టు చేయాలి.

చివరకు పరిణతి చెందిన వ్యక్తిగా తనే తనకు తల్లి తండ్రి అయ్యేదశకు చేరుకొంటాడు, ఇప్పుడతనిలో అతని తల్లి తండ్రి ఉన్నారు; మాతృసదృశ, పితృసదృశ అంతరాత్మ. అతనిలో ఏర్పడింది. మాతృసదృశ అంతరాత్మ అంటుంది; ''నీజీవితం సుఖమయం కావాలనే నా ఆకాంక్షను, ఆశీస్సును, నీమీదనాకున్న ప్రేమను ఈ ప్రపంచంలో ఏదోషం, నేరం కూడ వంచింపలేవు''. పితృసదృశ అంతరాత్మ అంటుంది కదా ''నీవు తప్పు చేశావు దానిఫలితం అనుభవించక తప్పదు. అన్నిటి కంటె ముఖ్యమైనది, నేను నిన్ను ప్రేమించాలంటే నీనడతను చక్కదిద్దుకో''. పరిణతిచెందిన వ్యక్తి బాహ్యమైన తల్లితండ్రుల మూర్తుల నుంచి (నిజమైన తల్లిదండ్రుల నుంచి) స్వేచ్ఛను పొంది, వారిని తన అంతరంగంలో ప్రతిష్ఠించు కొంటాడు. ఫ్రాయిడ్ చెప్పిన అధ్యహం (అంతరాత్మ Superego) లాగకాక, తల్లి తండ్రులను సంసర్గం (associate) చేసుకోవడం ద్వారా కాక, తన ప్రేమసామర్థ్యంతో మాతృసదృశ అంతరాత్మను, ఉచితానుచిత విచక్షణా జ్ఞానంతో పితృసదృశ అంతరాత్మను తనలో ప్రతిష్ఠించుకొంటాడు. అవి రెండు, విరుద్ధాలుగ గోచరించినప్పటికి, మాతృ సదృశ పితృ సదృశ అంతరాత్మలు రెండింటితో పరిణతవ్యక్తి ప్రేమిస్తాడు. పితృసదృశ ప్రేమను మాత్రమే తనలో నిలుపుకొంటే అతడు కర్కశుడు, అమానుషుడు అవుతాడు. మాతృసదృశ ప్రేమను మాత్రమే నిలుపుకొంటే అతడు ఉచితానుచిత జ్ఞానాన్ని కోల్పోయి తన, ఇతరుల వికాసాన్ని నిరోధించవచ్చు.

మాతృ కేంద్రం నుంచి పితృకేంద్రానికి మారే ఈ అనుబంధ వికాసం మాతృ పితృఅనుబంధాల అంతిమ సంశ్లేషణ, మానసిక స్వాస్థ్యానికి పరిపక్వతకు మూలము. ఈ వికాసం, సంశ్లేషణం సక్రమంగా జరగకపోతే ఆవ్యక్తి న్యూరొటిక్ అవుతాడు. ఈ మార్గంలో ఎక్కువ చర్చించడం ఈ పుస్తకపరిధికి మించింది కనుక, క్లుప్తంగా కొన్ని విషయాలు చెబితే విషయం స్పష్టమవుతుంది. న్యూరోసిస్‌కు ఒకకారణం, ప్రేమతో అతిగారాబం చేసి, అర్థంపర్థం లేని ఆజ్ఞలు జారీచేసే తల్లి, బలహీనుడు నిరాసక్తుడు అయినతండ్రి లభించడము. ఇటువంటి సందర్భాలలో పిల్లవాడు మొదట్లోనే మాతృబద్ధరాగం (Mother attachment)లో స్థిరీభవనం (Fixation) చెందుతాడు. పూర్తిగా తల్లిమీద ఆధారపడే వ్యక్తి అవుతాడు. నిస్సహాయత అతని లక్షణమవుతుంది. పరిగ్రహణం' రక్షింపబడడం, తనబాగోగులు ఇతరులు వహించడం లాంటి ప్రతీచ్ఛక (receipient) గుణాలను పుణికి పుచ్చుకొంటాడు. పితృసదృశ గుణాలైన క్రమశిక్షణ, స్వాతంత్ర్యం, తనజీవితాన్ని తనేదిద్దుకోవడం లాంటివి అతని దరిచేరవు; ప్రతి ఒక్కరిలోను అతడు తల్లిని దర్శింప ప్రయత్నిస్తాడు. కొన్నిసార్లు స్త్రీలలో, మరికొన్నిసార్లు హోదా అధికారాలున్న పురుషులలో తల్లిని చూస్తాడు. పైన చెప్పిన తల్లిలాంటి తల్లి కాక.

మరొక తల్లి నిరాదరంగా నిరాసక్తంగా ఉంటూ అర్థంపర్థంలేని ఆజ్ఞలు జారీచేస్తుంది. అలాంటప్పుడు బిడ్డ 'తల్లి ఇచ్చేరక్షణ' కోసం తండ్రిని లేదా తండ్రి తరవాత తండ్రి అంతవారిని ఆశ్రయించవచ్చు. ఫలితం పైసందర్భం లాగా ఉంటుంది. లేనట్లయితే, పితృదశలో ఎదిగే వ్యక్తి అయి, న్యాయసూత్రాలకు, చట్టానికి, ధర్మానికి, అధికారానికి, అర్పణ గావించుకొంటాడు. షరతులు లేని ప్రేమను అందుకోవడానికిగాని, ఆశించడానికి గాని అశక్తుడవుతాడు. తండ్రి అధికారిక మనస్తత్వం కలిగి కొడుకు బద్ధరాగుడైతే, ఈ పెరుగుదల ఇదే దిశలో విస్తరించి తీవ్రతరమవుతుంది. ఈన్యూరోటిక్ పరిణామాలలో మాతృసదృశ లేదా పితృసదృశపక్షాలలో 'ఏదో ఒకటి సక్రమంగా వికసించకపోవడం జరుగుతుంది. తీవ్రనాడీరుగ్మతలలోను ఇదే జరుగుతుంది. లేదా తల్లి దండ్రులు నిర్వహించే పాత్రలను బయటివ్యక్తులకు అన్వయించినప్పుడు, అతని అంతరంగంలో వారి పాత్రలకు అన్వయించినప్పుడు తికమక ఏర్పడుతుంది. ఇంకొంచెం లోతుగ పరిశీలిస్తే, పితృబద్ధరాగం (father attachment) ఏకపక్షంగా విస్తరించినప్పుడు. "బలాత్కార న్యూరోసిస్" (Obsessional neurosis) లాంటి కొన్నిరకాల నాడీరుగ్మతలు వస్తాయి. మరికొన్ని - త్రాగుడు. జీవితంలో ఓటమిలాంటి అవసాదాలు (depressions), హిస్టీరియా - మాతృ కేంద్రప్రభావం ఎక్కువైనందు వల్ల వస్తాయి.

## 3. ప్రేమ వస్తువులు (Objects of Love)

ప్రేమ ప్రాథమికంగా ఏదో ఒకవ్యక్తితో సంబంధం కాదు. అది ఒక దృక్పథము. ప్రేమించిన వస్తువుతోకాక ప్రపంచం అంతటితోను వ్యక్తికి ఉన్న సంబంధిత్వాన్ని (relatedness) నిర్ణయించే స్వభావధోరణి (Orientation of Character). ఒక వ్యక్తి మరొక వ్యక్తిని మాత్రమే ప్రేమించి, మిగతావారినందరిని నిరపేక్షతో చూస్తే, అతని ప్రేమ సహజీవనసంయోగం, లేదా విస్తృత ఆత్మాభిమానం (egotism) అవుతుందే తప్ప, ప్రేమకాదు. అయినా చాలమందికి వస్తువును బట్టి ప్రేమ ఏర్పడుతుంది కాని శక్తి (faculty) ద్వారాకాదని నమ్ముతారు. ప్రేమించిన వ్యక్తిని తప్ప అన్యుని ప్రేమించలేకపోవడం ఆదర్శప్రేమకు నిదర్శనమని చాల మంది అనుకొంటారు. ఇదే దోషాన్ని ఇంతకు ముందు చెప్పాము. ప్రేమకు ఒక క్రియాశీలతగ గుర్తించలేదు కనుక, ఆత్మశక్తిగ, గుర్తించలేదు, గనుక "చేయవలసిందల్లా సరైన వస్తువును కనుగొనడమే - ఆ తర్వాత ప్రతిది దాని అంతట అదే జరిగిపోతుంది", అని అనుకొన్నాడు. చిత్రాలు గీయాలనుకొన్న ఒకడు, చిత్రలేఖనం నేర్చుకొనడానికి మారు, "సరైన వస్తువు కనిపించాలే కాని, అది కనిపిస్తే అందంగా చిత్రించడమెంత పని", అని చెప్పాడనుకోండి. ఇతని దృక్పథానికి అతని దృక్పథానికి తేడాలేదు. నిజంగా నేనొకవ్యక్తిని ప్రేమించినట్లయితే, నేను అందరిని ప్రేమిస్తాను; నేను ప్రపంచాన్ని ప్రేమిస్తాను. నేను జీవితాన్ని ప్రేమిస్తాను. అతనికి "నేను నిన్ను ప్రేమించానని" చెప్పగలిగితే, "నీలో నేను ప్రతి ఒక్కరిని ప్రేమిస్తున్నా (చూస్తున్నా)నని, నీద్వారా నేను ప్రపంచాన్ని ప్రేమిస్తున్నానని, నీలో నన్నుగూడ ప్రేమిస్తున్నానని", చెప్పగలగాలి.

(సశేషం)

Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717



MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191

Fighting for space: Picasso's Weeping Woman, currently kept in store, would find room in the new gallery.

